

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 15-05-2026 | సంపుటి - 27 | సంచిక -353 | రూ : 4 | పేజీలు: 8




## మోదీ సర్కారు వైఫల్యంతోనే

# నీట్ రద్దు

2లో

- లీకేజీల్లో భాజపా, భారాస మధ్య పోలికలు
- విద్యార్థుల భవిష్యత్తుకు విలువ లేకుండా చేశారు
- కేంద్ర ప్రభుత్వంపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు

## జులై 31న

# కోర్టుకు రండి

- ఫార్ములా ఈకార్ రేసు కేసులో కేటీఆర్,
- అరవిందకుమార్, బీఎల్ఎన్ రెడ్డి,
- కిరణ్‌రావుకు ఏసీబీ కోర్టు నోటీసులు.

2లో





# జూన్ 25 నుంచి 'సర్'

- తెలంగాణ అవతరించాక మొదటిసారి నిర్వహణ
- షెడ్యూల్ విడుదల
- 83 లక్షల ఇళ్లకు వెళ్లి సర్వే చేయనున్న బీఎల్‌వోలు
- ఈ నెల 12 నాటికి ఉన్న ఓటర్లు 3,39,20,705 మంది
- జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితా
- తుది ప్రచురణ అక్టోబరు 1న

2లో




## కేంద్రం నిర్లక్ష్యం..

# తీరు మారని ఎన్‌టీఏ

2లో

- ఆరు నెలల క్రితమే పార్లమెంటరీ కమిటీ హెచ్చరికలు హైలెవల్ కమిటీ సూచనలూ బేఖాతరు
- బ్లాక్‌లిస్ట్ కంపెనీలకే మళ్లీ కాంట్రాక్టులు
- పరీక్షల భద్రతపై తీవ్ర ప్రశ్నలు
- తాజాగా మరోసారి నీట్ లీక్ వివాదం
- నష్టపోతున్న విద్యార్థులు, అభ్యర్థులు
- మోడీ సర్కారుపై విమర్శల వెల్లువ

## భగీరథ్ మధ్యంతర బెయిల్‌పై

# నేడు హైకోర్టు నిర్ణయం

- ఆ వాడీవేడిగా సాగిన వాదనలు.. నేడు బాధితురాలి తరఫున వాదనలు

హైదరాబాద్ : పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజరు కుమారుడు బండి సాయి భగీరథ్ దాఖలు చేసిన మధ్యంతర ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు ఇవ్వ నుంది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచా రణను వచ్చే వారానికి వాయిదా వేసిన కోర్టు, ప్రస్తుతం అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించాలనే అభ్యర్థనపైనే విచారణ చేస్తున్నట్లు స్పష్టం చేసింది.

తరువాయి 2లో





# బ్రిక్స్‌కు సంకట స్థితి!

- కూటమి ఐక్యతకు ఇరాన్ సంక్షోభం భారీ పరీక్ష
- అమెరికా-ఇజ్రాయిల్ చర్యలను ఖండించే సంయుక్త ప్రకటన కోరుతున్న టెహ్రాన్
- ఇరాన్‌కు భిన్నంగా యూఏఈ వంటి దేశాల ప్రయోజనాలు
- న్యూఢిల్లీ సమావేశంలో సభ్య దేశాల విభిన్న వ్యూహాత్మక ప్రయోజనాలు బహిర్గతం
- ఏకాభిప్రాయం కష్టమేనంటున్న అంతర్జాతీయ నిపుణులు
- అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్‌కు పెద్ద సవాల్

2లో

## టోకు ధరలకు

# 'ఇంధన' మంట




- ఏప్రిల్‌లో 8.3%
- 42 నెలల గరిష్ఠమిది

పశ్చిమాసియా ఉద్రిక్తతలు సృష్టించిన ఇంధన సంక్షోభ ప్రభావంతో, దేశీయంగా టోకు ధరలు భగ్గుమన్నాయి. టోకు ధరల

తరువాయి 2లో

## యూపీలో

# ఈదురుగాలి బీభత్సం

- ఒక్కరోజే 111 మంది మృతి
- గాలిలో 300 మీటర్ల దూరం ఎగిరిపడిన వ్యక్తి...వీడియో వైరల్
- దెబ్బతిన్న పలు ఇండ్లు, వాహనాలు

2లో



# మోదీ సర్కారు వైఫల్యంతోనే నీట్ రద్దు

హైదరాబాద్: నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ.. మోదీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రశ్నపత్రాల లీకేజీ కారణంగా పరీక్ష రద్దు కావడంతో యువత భవితవ్యంపై ప్రభావం పడుతోందని తెలిపారు. పోటీపరీక్షల ప్రశ్నపత్రాల లీకులతో విద్యార్థుల భవిష్యత్తుకు విలువ లేకుండా చేశారని అన్నారు. ప్రశ్న పత్రాల లీకేజీలు, వైఫల్యాలు, విద్యార్థులకు ద్రోహం, వ్యవస్థీకృత అవినీతిలో భాజపా, భారాస మధ్య పోలికలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటిదాకా కేంద్ర స్థాయిలో నిర్వహించే పలు పరీక్షల పత్రాలు లీకైనా సంబంధిత ఏ ఒక్క కేంద్ర మంత్రీ ఎందుకు రాజీనామా చేయలేదని.. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**పెద్దనోట్ల రద్దు లాంటిదే..**

“నీట్ రద్దు.. దేశప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిన పెద్దనోట్ల రద్దు వంటిదే. లీకేజీలతో విద్యార్థులకు భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు. దేశ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. వ్యవస్థీకృతంగా మారిన ప్రశ్నపత్రాల లీకేజీలు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను తీవ్ర అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయి. ఎంతో ఒత్తిడి మధ్య ఏళ్ల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు మోదీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కల్లలు అయ్యాయి. ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి, కొంతమంది నగలు అమ్మి పిల్లలను నీట్‌కు సిద్ధం చేశారు. ఇప్పుడు వారి ఆశలన్నీ గల్లంతు కావడం బాధాకరం. 2019 నుంచి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పత్రాలు లీక్ అయ్యాయి. భాజపా పాలిత రాష్ట్రాలే ఈ లీకేజీలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి.

**గుజరాత్‌లోనే 14 లీకేజీ ఘటనలు..**

మోదీ అధికారంలోకి వచ్చాక 11 ఏళ్లలో ప్రభుత్వ పరీక్షల వ్యవస్థలో వ్యవస్థీకృత నేరాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ‘ది పేపర్ లీక్ డికేడ్’ శ్వేతపత్రం ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర పరీక్షల్లో ఇప్పటిదాకా 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయి. వీటితో దాదాపు 2 కోట్ల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారు. 2024లో కేవలం ఎనిమిది వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు.. నీట్ యూజీ, యూజీసీనెట్, సీఎస్ఐఆర్‌నెట్, నీట్ పీజీ రద్దు అయ్యాయి. 2024లో యూపీ పోలీసు కానిస్టేబుల్ పరీక్ష రద్దుకావడంతో 16 లక్షల మంది మహిళలతో సహా 48 లక్షల మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. పీఎం సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో 14 ప్రధాన పరీక్షల ప్రశ్నపత్రాల బహిర్గతమయ్యాయి. యూపీ, మధ్యప్రదేశ్, హరియాణా భాజపా పాలిత రాష్ట్రాలు కుంభకోణాల జాబితాలో ఉన్నాయి. 2024 ఫిబ్రవరిలో పబ్లిక్ పరీక్షల (తప్పుడు మార్గాల నివారణ) చట్టం ఆమోదించినా, ఇప్పటికే పలు కుంభకోణాలు వెలుగు చూసినా.. ఆ చట్టం అమల్లోకి రాలేదు.

**విశ్వసనీయత కాపాడాలి...**

జాతీయస్థాయిలో నిర్వహించే పరీక్షల విశ్వసనీయత కాపాడాలి. పేపర్ లీకేజీ, అవినీతిలో భాగమైన వారు ఎంతటి వారైనా, ఏ స్థాయిలో ఉన్నా కఠిన శిక్షలు విధించాలి. నీట్ 2026కు దేశవ్యాప్తంగా 551, విదేశాల్లో 14 నగరాల్లోని కేంద్రాల్లో దాదాపు 22.79 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షవిధానంలో లోపాలు, అక్రమాలతో విద్యార్థులంతా ఆందోళనలో ఉన్నారు. ప్రశ్నపత్రం లీకేజీపై కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పారదర్శకంగా, నిర్ణీత వ్యవధితో కూడిన, విశ్వసనీయ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నా. వ్యవస్థాపరమైన వైఫల్యాల కారణంగా అమాయక విద్యార్థులు పదేపదే ఇబ్బందులు పడకూడదని కోరుతున్నాం. ఎంతో మానసిక ఒత్తిడి, ఆర్థిక భారంతో విద్యార్థులు నీట్‌కు సన్నద్ధమవుతుంటారు. పోటీపరీక్షలు విద్యార్థుల ప్రతిభ, అవకాశాలకు వేదికగా ఉండాలి.. కానీ ఆందోళనకు, అనిశ్చితికి కారణం కాకూడదు.

## జూన్ 25 నుంచి ‘సర్’

ఢిల్లీ, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(సర్) మూడో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. సంబంధిత షెడ్యూల్‌ను గురువారం ప్రకటించింది. ప్రస్తుతం జనగణనలో భాగంగా దేశవ్యాప్తంగా గృహగణన నిర్వహిస్తున్న యంత్రాంగాన్ని దృష్టిలో ఉంచుకొని అదే కార్యక్రమంతోపాటు సర్ మూడో దశ షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వో) జూన్ 15 నుంచి జులై 14 తేదీల మధ్యలో ఇంటింటికీ తిరిగి పరిశీలన చేస్తారు. తెలంగాణలో ఈ కార్యక్రమం జూన్ 25 నుంచి జులై 24వ తేదీల మధ్యలో ఉంటుంది. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌లు మినహాయించి దేశంలోని మిగిలిన అన్ని రాష్ట్రాల్లో సర్ మూడో దశ కార్యక్రమం కొనసాగుతుంది. “ఇది ఓటర్లు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారులందరి భాగస్వామంతో నిర్వహించే కార్యక్రమం. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలూ ప్రతి పోలింగ్ బూత్‌కూ బూత్‌స్థాయి ఏజెంట్లను నియమించాలి. పార్టీలు పూర్తిస్థాయిలో భాగస్వామ్యమైతే ఈ కార్యక్రమం పూర్తి పారదర్శకతతో నిర్వహించడానికి వీలవుతుంది” అని ఎన్నికల సంఘం పేర్కొంది. ‘ఈ నెలాఖరు నుంచి అక్టోబరు 14వ తేదీ వరకు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో 3.94 లక్షల మంది బూత్‌స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి 36.73 కోట్ల మంది ఓటర్లను కలుస్తారు. వారికి రాజకీయ పార్టీలు నియమించిన 3.42 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లు సహకారం అందిస్తారు. ఇప్పటివరకు తొలి రెండు దశలను 59 కోట్ల ఓటర్లున్న 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించాం. అందులో 6.3 లక్షల మంది బూత్‌స్థాయి అధికారులు, 9.2 లక్షల మంది బూత్‌స్థాయి ఏజెంట్లు పాలుపంచుకున్నారు’ అని ఎన్నికల సంఘం తెలిపింది.

**మూడో దశలో సర్ జరిగే రాష్ట్రాలు**

1)ఆంధ్రప్రదేశ్, 2)అరుణాచల్‌ప్రదేశ్, 3) హరియాణా, 4)ఝార్ఖండ్, 5)కర్ణాటక, 6) మహారాష్ట్ర, 7)మణిపుర్, 8)మేఘాలయ, 9) మిజోరం, 10)నాగాలాండ్, 11)ఒడిశా, 12)పంజాబ్, 13)సిక్కిం, 14)త్రిపుర, 15) తెలంగాణ, 16)ఉత్తరాఖండ్.

**కేంద్రపాలిత ప్రాంతాలు**

చండీగఢ్, దాద్రానగర్ హవేలీ, దామన్‌దీవు, దిల్లీ.

**ప్రతి ఇంటికి రెండు గణన పత్రాలు**

ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా 2002లో ఎస్ఐఆర్ సర్వే జరిగింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారి చేపట్టనున్నారు. ఇప్పటికే అధికారులు 2002 నాటి, తాజా ఓటర్ల జాబితాలను బీఎల్‌వోలకు అందించారు. వారు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లకు రెండు గణనపత్రాలను ఇస్తారు. పూర్తి చేసిన ఒక ప్రతిని తీసుకుని, రెండోది ఓటరుకు రసీదుగా అందిస్తారు. ఓటర్లు గణనపత్రాలను ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఆన్‌లైన్‌లోనూ సమర్పించవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులను సైతం బీఎల్‌వోలు ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు ధ్రువీకరణ చేస్తారు.

## కేంద్రం నిర్లక్ష్యం.. తీరు మారని ఎన్‌టీఏ

న్యూఢిల్లీ : నీట్ యూజీ2026 పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా మరోసారి ఆగ్రహాన్ని రగిలిచింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఇప్పటికే మోడీ సర్కారుపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చుతున్నారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో వరుస వైఫల్యాలతో విమర్శలు ఎదుర్కొంటున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పని తీరు చర్చకు వస్తోంది. కేంద్రం నిర్లక్ష్యం, ఎన్‌టీఏ ఉదాసీన వైఖరి వెరసి ఇప్పుడు పేపర్ లీక్ వ్యవహారంతో లక్షలాది మంది విద్యార్థులు ప్రభావితం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందని మేధావులు, విద్యావేత్తలు అంటున్నారు. ఎన్‌టీఏపై పార్లమెంటరీ ప్యానెల్ స్టాండింగ్ కమిటీ గతేడాది డిసెంబర్‌లోని తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ విషయంలో గట్టిగానే హెచ్చరించింది. అయినా సంస్థ తీరులో మార్పు రాలేదనీ, చివరికి ఈ ఏడాది నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీతో ఇది బట్టబయలైందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్‌టీఏ తన పనితీరును సరిచేసుకోవాలి అంటూ కమిటీ హెచ్చరించిన ఆరు నెలలకే మరోసారి నీట్ లీక్ వివాదం వెలుగుచూడటంతో దీనిని మోడీ సర్కారు వైఫల్యంగా ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

**2024.. వ్యవస్థను కుదిపేసిన సంవత్సరం**

2024లో మోడీ సర్కారు మళ్లీ అధికారంలోకి వచ్చింది. కొద్ది రోజులకే మే నెలలో వెలుగు చూసిన నీట్ పేపర్ లీక్ దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలకు దారి తీసింది. ఈ ఘటనతో కేంద్రం ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పరీక్షల వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో 2024 జూన్‌లో కేంద్ర విద్యాశాఖ... ఎన్‌టీఏ ద్వారా నిర్వహించే పరీక్షలను పారదర్శకంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు హై లెవల్ కమిటీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ (హెచ్‌ఎల్‌సీఈ)ను ఏర్పాటు చేసింది.

**నమ్మకమైన వ్యవస్థను**

అందించడంలో కేంద్రం విఫలం

విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన జాతీయ స్థాయి పరీక్షల విషయంలో వరుసగా జరుగుతున్న లీకులు, గందరగోళ పరిస్థితులు కేవలం పరిపాలనా లోపాలుగా మాత్రమే చూడలేమని విమర్శకులు అంటున్నారు. పార్లమెంటరీ కమిటీ హెచ్చరికలు, నిపుణుల కమిటీ సిఫారసులు ఉన్నప్పటికీ పరిస్థితి మారకపోవడం మోడీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ‘పరీక్షల పారదర్శకత’ అంటూ ప్రచారం చేసిన కేంద్రం... విద్యార్థులకు నమ్మకమైన వ్యవస్థను అందించడంలో మాత్రం విఫలమైందనే భావన దేశవ్యాప్తంగా బలపడుతోంది.

**శ్ర హై లెవల్ కమిటీ సూచనలు పట్టించుకోని మోడీ సర్కారు**

పరీక్షల నిర్వహణ విధానం, డేటా భద్రతా ప్రమాణాలు, అలాగే ఎన్‌టీఏ నిర్మాణం, పనితీరులో సంస్కరణలపై సూచనలు ఇవ్వడం ఈ కమిటీ బాధ్యతగా నిర్ణయించారు. ఇస్రో మాజీ చైర్మెన్ కె.రాధాకృష్ణన్ అధ్యక్షతన ఈ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ గతేడాది అక్టోబర్‌లో తన నివేదికను సమర్పించింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా తన నివేదికలో ఈ కమిటీ సూచనలు, పరిశీలనల పైనే ప్రధానంగా ఆధారపడింది. ఈ హెచ్‌ఎల్‌సీఏ కమిటీ ప్రశ్నాపత్రాల భద్రత కోసం ఎన్‌క్రిప్టెడ్ డిజిటల్ డెలివరీ, పరీక్షా కేంద్రాల వద్దే ప్రింటింగ్, మొబైల్ ఫోన్ల నిషేధం, ఏడాది పాటు సీసీటీవీ రికార్డులను భద్రపరచడం, జియో ట్యాగింగ్‌తో రవాణా వంటి పలు కీలక సూచనలు చేసింది. అలాగే ప్రయివేటు సంస్థలపై ఆధారపడకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దేశవ్యాప్తంగా వెయ్యి భద్రతా పరీక్షా కేంద్రాలను నిర్మించాలని సిఫారసు చేసింది. ఈ సూచనల అమలు విషయంలో కేంద్రం ఆసక్తి చూపలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## బ్రిక్స్‌కు సంకట స్థితి!

* **అమెరికా-ఇజ్రాయిల్ చర్యల ఖండనపై ఏకగ్రీవ ప్రకటన కోరుతోన్న ఇరాన్**

న్యూఢిల్లీ : ఇరాన్ సంక్షోభం బ్రిక్స్ ఐక్యతకు ఒక భారీ పరీక్షగా నిలుస్తోంది. ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ దుశ్చర్యల నేపథ్యంలో బ్రిక్స్ కూటమి ఇప్పటివరకు తప్పించుకుంటూ వచ్చిన కీలక రాజకీయ పరీక్షను ప్రస్తుతం ఎదుర్కొంటోంది. ఆర్థిక సహకార వేదికగా ప్రారంభమైన ఈ కూటమి ఇప్పుడు అంతర్జాతీయ రాజకీయ సంక్షోభాలపై ఏకాభిప్రాయంతో స్పందించగలదా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం ఈ అంతర్గత విభేదాలను బహిర్గతం చేసిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఇరాన్‌అమెరికా ఇజ్రాయెల్ ఉద్రిక్తతల ప్రభావం సమావేశంపై స్పష్టంగా కనిపిస్తోంది. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా వంటి పాత సభ్యులతో పాటు ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వంటి కొత్త సభ్య దేశాలు కూడా చర్చల్లో పాల్గొంటున్నాయి. అధికారికంగా ‘గ్లోబల్ సౌత్’ ఆర్థిక సహకారమే ప్రధాన అంశమని ప్రకటించినప్పటికీ, వాస్తవానికి ఇరాన్ సంక్షోభమే చర్చల కేంద్రబిందువైందని అంతర్జాతీయ నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. ఈ సమావేశానికి వచ్చిన ఇరాన్ ప్రధాన లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గల్ఫ్ ఘర్షణలో అమెరికా, ఇజ్రాయెల్ చర్యలను ఖండిస్తూ బ్రిక్స్ నుంచి ఏకగ్రీవ ప్రకటన వెలువడాలని టెహ్రాన్ కోరుతోంది. పాశ్చాత్య ఆధిపత్యానికి ప్రత్యామ్నాయ శక్తిగా బ్రిక్స్‌ను చూపించాలని ఇరాన్ ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయ వేదికల్లో తన ఒంటరితనాన్ని తగ్గించుకోవడమే కాకుండా, ప్రపంచ రాజకీయాల్లో శక్తి సమీకరణాలు మారుతు న్నాయనే సందేశాన్ని ఇవ్వాలనుకుంటోంది. అయితే ఇరాన్ ఆశలు బ్రిక్స్ అంతర్గత వాస్తవాలకు భిన్నంగా ఉన్నాయి. ఎందుకంటే ప్రస్తుతం ఈ కూటమి ఒకే విధమైన వ్యూహాత్మక ప్రయోజనాలు కలిగిన దేశాల సమూహం కాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. పరస్పర విభిన్న రాజకీయ, భద్రతా, ఆర్థిక ప్రయోజనాలు కలిగిన దేశాల కలయికగా బ్రిక్స్ మారిందని చెప్తున్నారు.

## భగీరథ్ మధ్యంతర బెయిల్‌పై నేడు హైకోర్టు నిర్ణయం

హైదరాబాద్ : పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజరు కుమారుడు బండి సాయి భగీరథ్ దాఖలు చేసిన మధ్యంతర ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు శుక్రవారం తీర్పు ఇవ్వనుంది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన కోర్టు, ప్రస్తుతం అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కల్పించాలనే అభ్యర్థనపైనే విచారణ చేస్తున్నట్లు స్పష్టం చేసింది. దీనిపైనే ఇరుపక్షాల వాదనలు పూర్తి చేసి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేస్తామని జస్టిస్ మాధవీదేవి గురువారం ప్రకటించారు. పేట్‌బషీరాబాద్ పీఎస్‌లో నమోదైన పోక్సో కేసులో అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ భగీరథ్ వేసిన పిటిషన్ తరఫు సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు పూర్తి చేశారు. పిటిషనర్‌పై కేసును రద్దు చేయాలని తాము కోరడం లేదని, దర్యాప్తునకు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, అరెస్టు చేయకుండా పిటిషనర్‌కు రక్షణ కల్పించాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు. ఎఫ్ఐఆర్‌లో తొలుత నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు సంబంధించినవేనని, అనంతరం కొత్త సెక్షన్లు చేర్చి కేసును తీవ్రతరం చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన అర్నేష్ కుమార్ తీర్పు ప్రకారం ఏడేళ్లలోపు శిక్ష ఉన్న కేసుల్లో అరెస్టు చేయరాదని గుర్తుచేశారు. బాధితురాలి వయసుపై కూడా అనేక సందేహాలు ఉన్నాయన్నారు. ఒక బర్త్ డాక్యుమెంట్‌లో 2008గా, మరో పత్రంలో 2010గా నమోదు ఉందన్నారు. అలాగే 2021లో నిర్మల్‌లో నమోదైన డ్రైవింగ్ కేసులో బాధితురాలి వయసు 15 ఏళ్లుగా నమోదు చేశారని, దీని ప్రకారం ఆమె వయసు 19-20 ఏళ్లు మధ్య ఉంటుందన్నారు. ఆమె మేజర్ అయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఒకవేళ ఆమె మైనర్ అయినప్పటికీ, సంఘటన జరిగినట్లు చెబుతున్న తేదీ నుంచి నాలుగు నెలల తర్వాత మాత్రమే ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదులో భగీరథ్, బాధితురాలు రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లు ప్రస్తావించారని చెప్పారు. గత ఏడాది జూన్‌లో పరిచయం ప్రారంభమై, డిసెంబర్ చివరిలో విభేదాలు వచ్చినట్లు ఫిర్యాదులో ఉందన్నారు.

## యూపీలో ఈదురుగాలి బీభత్సం

లక్నో: యూపీలో మండు వేసవిలో తీవ్ర గాలి దుమారం, భారీ వర్షం పెనుబీభత్సం సృష్టించింది. ఈ క్రమంలోనే బరేలీ జిల్లాలో బలమైన ఈదురు గాలుల కారణంగా ఓ వ్యక్తి 300 మీటర్లు దూరం ఎగిరిపడ్డాడు. గాలిదుమారం రావడంతో ఆ వ్యక్తి ఓ షెడ్డును పట్టుకుని నిలబడ్డాడు. అయితే గాలి తీవ్రతకు షెడ్డుతో సహా 50 అడుగుల ఎత్తులోకి ఎగిరి పొలంలో పడ్డాడు. ఈ ప్రమాదంలో బాధితుడికి గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడిని బమియానా గ్రామానికి చెందిన నన్హే మియాన్‌గా గుర్తించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. “గాలి చాలా బలంగా వీయడంతో రేకుల షెడ్డు పెద్ద శబ్దాలు చేయడం ప్రారంభించింది. నేను దానిని పట్టుకోకపోతే అది తుఫానుకు కొట్టుకుపోతుందని అనుకున్నాను. అందుకే వెంటనే షెడ్డుకు కట్టిన తాడును పట్టుకున్నాను. కానీ, అప్పుడు చాలా బలమైన గాలుల తాకిడికి షెడ్డుతో సహా నన్ను, మరో ఇద్దరినీ గాలిలోకి తీసుకెళ్లింది. ఆ తర్వాత గాలి తీవ్రత కాస్త తగ్గి కింద పడే ముందు నన్ను దాదాపు 50 అడుగుల ఎత్తుకు తీసుకువెళ్లింది” అని బాధితుడు నన్హె చెప్పాడు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ఘటన వీడియోలోనూ ఆ వ్యక్తి రేకుల షెడ్డును పట్టుకుని గాలిలోకి ఎగిరిపోవడం కనిపిస్తుంది. మొదట్లో కొంతమంది నెటిజన్లు ఈ వీడియోపై అనుమానం వ్యక్తం చేశారు. ఇది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి సృష్టించిందని అన్నారు.

**ఒక్క రోజులోనే 111 మంది మృతి**

యూపీలోని పలు జిల్లాల్లో తలెత్తిన ప్రకృతి వైపరీత్యానికి బుధవారం ఒక్కరోజే 111 మంది మరణించారు. వందల మందికి గాయాలయ్యాయి. ప్రయాగ్‌రాజ్ జిల్లాలో అత్యధికంగా 21 మంది మృతి చెందారు. భదోహిలో 16 మంది మరణించారు. ఫతేపూర్, ప్రతాప్‌గఢ్, బదౌన్, కుశీనగర్, సోన్‌భద్ర ప్రాంతాల్లో మిగిలిన వారు బలయ్యారు. గాలివాన బీభత్సానికి ఆయా ప్రాంతాల్లో భారీ ఆస్తినష్టం సంభవించింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. పలు ఇండ్లు, వాహనాలు దెబ్బతిన్నాయి. ప్రకృత వైపరీత్యం సృష్టించిన విలయంపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆరా తీశారు.

## జులై 31న కోర్టుకు రండి

రాష్ట్రంలో సంచలనం రేపిన పార్ములా ఈ కార్ రేస్ కేసును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలోనే జులై 31తేదీన తమ ఎదుట హాజరుకావాలనీ ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు ఐదుగురు నిందితులకు గురువారం నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో ఈ కేసులో ప్రధాన నిందితుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్ఎండీఏ మాజీ ప్రత్యేక కార్యదర్శి, ప్రస్తుత మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ సీఈఓ బీఎల్ఎన్‌రెడ్డి, క్రీడల ప్రత్యేక సలహాదారు కిరణ్ మల్లేశ్వర్‌రావుతో పాటు ఎఫ్ఈఓ సంస్థలు ఉన్నాయి. 2023లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పార్ములా ఈ కార్‌రేసు నిర్వహణకోసం హెచ్ఎండీఏ రూ. 56కోట్లను లండన్‌లోని ఎఫ్ఈఓ సంస్థకు పంపించి ఫెమా చట్టాన్ని ఉల్లంఘించిందని ఏసీబీ అధికారులు కేసును నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆర్‌బీఐ నిబంధనలను ఉల్లంఘించి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ మౌఖిక ఆదేశాల మేరకు హెచ్ఎండీఎలో ఉన్న ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, సీఈఓ బీఎల్ఎన్ రెడ్డిలు అంత పెద్ద మొత్తంలో డబ్బులను ఎఫ్ఈఓకు పంపించారనీ ఏసీబీ కోర్టులో వేసిన చార్జిషీట్‌లో ఆరోపించింది.

## టోకు ధరలకు ‘ఇంధన’ మంట

పశ్చిమాసియా ఉద్రిక్తతలు సృష్టించిన ఇంధన సంక్షోభ ప్రభావంతో, దేశీయంగా టోకు ధరలు భగ్గుమన్నాయి. టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 8.3 శాతానికి పెరిగింది. ఇది 42 నెలల గరిష్ఠం. ఈ ఏడాది మార్చిలో డబ్ల్యూపీఐ 3.88% కాగా.. 2025 ఏప్రిల్‌లో 0.85 శాతంగా నమోదైంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభించాక.. అంతర్జాతీయంగా ముడి చమురు ధర బాగా పెరిగింది. దీనికి తోడు సరఫరా పరమైన అవరోధాలు ఇబ్బంది పెడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇళ్లలో వినియోగించే వంట గ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరను మార్చిలో రూ.60 పెంచారు. వాణిజ్య సిలిండర్ ధరను మాత్రం 3 విడతల్లో రూ.1300కు పైగా పెంచి రూ.3,000 చేశారు. పెట్రోల్, డీజిల్ రిటెయిల్ ధరలను సవరించకున్నా, బల్క్ డీజిల్ ధరను పెంచారు. ముడిచమురుతో ముడిపడిన ఉత్పత్తుల ధరలన్నీ పెరగడంతో, కంపెనీలు తమ ఉత్పత్తుల ధరలను సవరించాయి. ఈ ప్రభావం టోకు ద్రవ్యోల్బణంపై పడింది. ఏప్రిల్ నెలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఏప్రిల్‌లో ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠమైన 24.71 శాతానికి పెరిగింది. మార్చిలో ఇది 1.05 శాతంగా ఉంది. క్రూడ్ పెట్రోలియమ్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 88.06 శాతంగా నమోదైంది. 2021 అక్టోబరు తర్వాత ఇదే గరిష్ఠ స్థాయి. ఆహార ఉత్పత్తుల ద్రవ్యోల్బణ రేటు మార్చిలో 1.9% కాగా, ఏప్రిల్‌లో 1.98 శాతానికి పెరిగింది. ఆహారేతర పదార్థాల ద్రవ్యోల్బణ రేటు 11.5% నుంచి 12.18 శాతానికి చేరింది. తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 3.39% నుంచి 4.62 శాతానికి పెరిగింది. ఇంధనం, విద్యుత్ విభాగం: ఏప్రిల్‌లో ఎల్‌పీజీ ద్రవ్యోల్బణం 10.92 శాతానికి పెరిగింది. మార్చిలో ఇది 1.54 శాతంగా ఉంది. పెట్రోలు ద్రవ్యోల్బణ రేటు 2.5% నుంచి 32.40 శాతానికి; హై స్పీడ్ డీజిల్ ద్రవ్యోల్బణ రేటు 3.26% నుంచి 25.19 శాతానికి చేరింది. లోహాలు, రసాయనాలు, జౌళి ఉత్పత్తుల తయారీ వ్యయాలు పెరగడమూ, డబ్ల్యూపీఐ గణనీయ వృద్ధికి దారితీసింది.

# దేవాదుల ప్రాజెక్టు భూ సేకరణ వేగవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ, ప్రజాస్ఫూర్తి: దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ అంశం పై సంబంధిత అధికారుల తో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు సంబంధించిన పెండింగ్ యూనిట్ లలో పెగ్ మార్కింగ్, సబ్ డివిజన్ రికార్డుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ ల్యాండ్ అండ్ సర్వే అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన ఎస్.డి. అర్ పూర్తి అయిన యూనిట్లకు వెంటనే ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయాలని, యూనిట్ 2, ఎస్.డి.సి అధికారులకు సూచించారు. కొత్త ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ ప్రతి పాదనలను జియో ట్యాగింగ్ చేసి సమర్పించాలని ఇంజినీరింగ్ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇరిగేషన్ ఎస్.ఈ సీతారాం, ల్యాండ్ అండ్ సర్వే ఏ.డీ మన్యం కొండా, భూ సేకరణ సెక్షన్ సూపరింటెండెంట్ చంద్రమోహన్, ఇరిగేషన్ శాఖ డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగ వంతం చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి అంశంపై హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీ గా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించిన కలెక్టర్, మార్క్ చేసినప్పటికీ నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్ల వివరాలు, అలాగే ఇంకా మార్క్ చేయని ఇళ్ల నివేదికలను సోమవారం లోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు మొత్తం 5,656 ఇళ్లు మంజూరు కాగా, దాదాపు 2,500 ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని తెలిపారు. ప్రతి వారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తామని, పురోగతి తప్పని సరిగా కనిపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీ.డీ మాత్రు నాయక్, డీ.ఈ లు, వివిధ మండలాల ఏ.ఈ లు పాల్గొన్నారు.



## ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఏర్పాట్లకు చర్యలు

*** జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరిత**




ప్రజాస్ఫూర్తి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా: జిల్లాలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కొరకు అవసరమైన ఏర్పాట్లను చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె హరితా అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో న్యూ డిల్లి లోని చీఫ్ ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుండి ముఖ్య ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ కుమార్ ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు ) మువరాజ్ మార్మాట్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి కలెక్టర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో చేపట్టే ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కొరకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూత్ స్థాయి అధికారులు సూపర్ వైజర్లను నియమించి శిక్షణ అందిచాలన్నారు. సవరణ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు భూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ పారాలు అందిస్తారని ప్రతి ఓటర్ అవసరమైన పత్రాలను జత పర్చి తిరిగి భూత్ స్థాయి అధికారులకు అందజేస్తారని భూత్ స్థాయి అధికారులు ఎన్యుమరేషన్ పారాలు సేకరిస్తారన్నారు. సవరణ పక్రియ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమములో ఎన్నికల విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## వీధి దీపాలు పునరుద్దరణ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణం, రామవరంలోగల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోరోడ్డు ఇరువైపులా గురువారం వీధి దీపాలను పునరుద్దరించారు. వీధి దీపాలు వెలగటం లేదని 18వ డివిజన్ కార్పొరేటర్ కంచర్ల హేమశ్రీ ఇటీవల ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు వీధి దీపాలను పునరుద్దరించాలని ఆదేశాలు జారీ చేయడంతో కార్పొరేషన్ సిబ్బంది వాటిని ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే కూనంనేనితోపాటు మున్సిపల్ కమిషనర్, డిఈ, ఏఈ లకు కార్పొరేటర్ హేమాశ్రీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

## భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఫోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ, పిఓడబ్ల్యూ, పివైఎల్, పిడిఎస్‌యు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం బాబుక్యాంపులో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై కేసు నమోదు అయితే ఇప్పటివరకు పోలీసులు అరెస్టు చేయకపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. కేసును పక్కదోవ పట్టించడానికి హానీట్రాప్‌గా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రిగా బండి సంజయ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లక్షల రూపాయలు పెట్టి కోచింగ్ తీసుకుని ఎన్నో ఆశలతో నీట్ పరీక్ష రాస్తే పేపరు లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. పేపర్ లీకేజీ దుండగులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ కొత్తగూడెం ఏరియా కార్యదర్శి ఎన్.సంజీవ్, పివైఎల్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నరేష్, పిడిఎస్‌యు పట్టణ అధ్యక్షుడు జీవన్, పిఓడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు రాధా, నాయకులు సాయి, విష్ణు, నాగభూషణం, నిర్మల, రాధా, పాపారావు, వీరయ్య, విజయ్, ఉమేష్, వైభవ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో పకడ్బందీగా సర్ చేపట్టాలి




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: భారత ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వీడియో కన్ఫరెన్స్‌లో మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ పాల్గొన్నారు. విసి అనంతరం ఆమె జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన విధంగా ఓటర్ జాబితాను రూపొందించడంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రత్యేక సమగ్ర సవరణ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లను సమకూర్చడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో దొరికిన వ్యక్తికి 10 వేల జరిమానా

ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి రూ.10 వేల జరిమానాను కోర్టు విధించింది. మెదక్‌లో చోటుచేసుకున్న సంఘటన వివరాలను మెదక్ పట్టణ సిఐ మహేశ్ వెల్లడించారు. ఈ నెల 12 న మెదక్ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన నేపథ్యంలో బాబు లాల్ అనే వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతు పట్టుబడ్డాడు. ఇతన్ని గురువారం పట్టణ పోలీసులు మొబైల్ కోర్టు లో హాజరు పరిచారు. ఈ క్రమంలో మొబైల్ కోర్టు జడ్జి సాయి ప్రభాకర్ మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 10 వేల జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని పట్టణ సిఐ మహేష్ ఈ సందర్భంగా తెలిపారు.

## మిషన్ భగిరధతో మారుమూల గ్రామాలకు తాగునీరు అందించాలి

*** అసిఫాబాద్ కలెక్టర్ కె హరిత**



ప్రజా స్ఫూర్తి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా: జిల్లాలో వేసవి కాలం దృష్ట్యా ప్రతి గ్రామానికి మిషన్ భగిరత పథకం ద్వారా శ్రద్ధ జలం ను అందించాలని కలెక్టర్ కె హరిత అన్నారు. గురువారం కెరమెరి మండలంలోని ధనోరా గ్రామములోని మిషన్ భగిరధ పంపు హౌస్ లను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. పంపు హౌస్ నుంచి ఎన్ని మండలాలకు తాగునీరును పంపింగ్ చేస్తున్నారని, ఎన్ని గ్రామాలకు నీరు అందుతుందని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా త్రాగు నీరుకు ఇబ్బందులు లేకుండా ప్రతి గ్రామానికి పంపింగ్ చేయాలన్నారు. అనంతరం కెరమెరి మండలంలోని కొరారి కోలం గూడ గ్రామాన్ని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి యన్ ప్రకాష్ రావు తో కలిసి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్దిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామానికి 110 ఇండ్లను మంజూరు చేయగా 108 ఇండ్ల పనులను ప్రారంబించడం జరిగిందని 7 ఇండ్లు పూర్తయ్యాయని తెలిపారు. మిగితా ఇండ్లు వివిధ దశలో వున్నాయని ఇందులో 86 ఇండ్లు స్లాబ్ వేసేందుకు సిద్దంగా ఉన్నాయన్నారు. లబ్ధిదారులు తమ ఇండ్లను పూర్తి నాణ్యతతో నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## తమది రైతు పక్షపాతి ప్రభుత్వం

*** రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి కొంటాం**
*** రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు**
*** రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి వెల్లడి**





నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దేశంలో వరి పండించడంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి ఆయన నల్గొండ జిల్లా, కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న అనంతరం అక్కడే రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గడచిన రెండున్నర సంవత్సరాలలో అత్యధికంగా వరి పండించిన కొనుగోలు చేసిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. ప్రతి రైతుకు మద్దతు ధర వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 22 వేల కోట్ల రూపాయలను చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ రబీలో 65 లక్షల ఎకరాలలో 140 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని అందులో 80 నుండి 90 లక్షలు మెట్రిక్ టన్నులు ప్రభుత్వం కొనుగోలు చేయనుందని, ధాన్యం కొనుగోలుకై 18.67 కోట్ల గన్ని బ్యాగులను పిపిసి సెంటర్లకు పంపించినట్లు మంత్రి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రబీ ధాన్యం కొనుగోలుకు 8575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని, 4600 కోట్ల రూపాయలు రైతుల అకౌంట్లలో జమ చేయడం జరిగిందని చెప్పారు. నల్గొండ జిల్లాకు సంబంధించి ఐదు లక్షల 46000 ఎకరాల్లో 14 లక్షల 65 వేల మెట్రిక్ టన్నులు ధాన్యంపండిందని, ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నల్గొండ జిల్లాలో 7 లక్షల 24 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో 1000 వాహనాలను రబీ ధాన్యంకై ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు పండించిన ధాన్యాన్ని ఎంఎస్పీ చెల్లించి కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రబీలో రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని ,అంతేకాక నిర్దేశించిన సమయంలో రైతుల ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందని, ట్రాన్స్పోర్ట్ , హమాలి సమస్యలనఅధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ బుధవారం ఒక్కరోజే నల్గొండ జిల్లాలో 19000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, రానున్న పది రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్ పి శరత్చంద్ర పవర్ ,రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డి సి ఓ పత్యా నాయక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రామ్ పతి నాయక్, డిఎస్ఓ వెంకటేశం, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు మంత్రుల వెంట ఉన్నారు.

## బడిబాట ర్యాలీ తో ప్రభుత్వ పాఠశాలల పై అవగాహన




జనగామ / లింగాల ఘణపురం, ప్రజాస్ఫూర్తి : విద్యా వారోత్సవాల సందర్భంగా గురువారం కుందారం గ్రామం లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మెగా పీటీఎం సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిట్ల రవిశంకర్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ర్థులకు ఉచిత నోటుపుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్స్, రెండు జతల యూనిఫాంలు, వారానికి మూడు కోడిగుడ్లతో కూడిన పౌష్టిక మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఐ.ఎఫ్.పి.బి బోర్డుల ద్వారా డిజిటల్ విద్యా బోధన, గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గంగసాని రాజేశ్వర్ రెడ్డి సహకారంతో పాఠశాలలో కంప్యూటర్ విద్య బోధన అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, టై, బ్యాడ్జి, బెల్టు, షూస్ తో కూడిన కిట్ పంపిణీ చేయను న్నట్లు వెల్లడించారు. బాలికలకు ఆత్మరక్షణ కోసం కరాటేలో ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల శారీరక - మానసిక ఆరోగ్యాభివృద్ధికి క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నా మని తెలిపారు. గ్రామంలోని పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఏఏపీసీ చైర్‌పర్సన్ కొంగరి సుమలత, ఉపాధ్యాయులు బి. శ్రీనివాసచారి, పి. వెంకటేశ్వర్లు, డి.రజిత, కె.కృష్ణవేణి, వి.శ్రీనివాస చారి, బి.రాములు, ఎం.సుధా రాణి తదితరులు పాల్గొన్నారు.

## టేకు చెట్లు నరికిన నలుగురికి రిమాండ్




ప్రజాస్ఫూర్తి, జన్నారం : అక్రమంగా టేకు చెట్లను నరికి వేసి తరలిస్తున్న నలుగురుని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జన్నారం అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... చింతగూడ బీట్ లో ఈ నెల 12 న డాగ్ స్క్వాడ్ చింతగూడ అటవీ అధికారులు అక్రమంగా చెట్లు నరికి వేత కేసులో సట్ల రాజన్న ,కొమిరె రాజం, ఆర్.పోశం, మైనేని సురేష్ లను పట్టుకున్నారు. విచారణలో నిందితులు ఇతరులతో కలిసి రాత్రివేళలో అడవిలోకి ప్రవేశించి టేకు చెట్లను అక్రమంగా నరికి కలపను విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరపరచగా వారికి రిమాండ్ విధించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. అటవీ సంపదను నాశనం చేసిన, వన్యాప్రానులను వేటాడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని అడవి శాఖ అధికారులు హెచ్చరించారు. డాగ్ స్క్వాడ్ బీట్ ఆఫీసర్ ఎల్ అనిల్ నాయక్, చింతగూడ సెక్షన్ అధికారి భోజనాయక్, బీట్ అధికారులు కృష్ణారావు, వెంకటేష్, శ్రీకాంత్, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ విస్తృత పర్యటనలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో ఏర్పాటు చేసిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులు రోజుకు కనీసం 10 కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా పర్యవేక్షించాలని జనగాం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. గురువారం రఘు నాథ్‌పల్లి మండలం ఖిలాషా పురం, ఎర్రగట్టు తండా, మేకల గట్టు, నర్మెట్ట మండలం నర్మెట్ట గ్రామం, వెల్దండ, జనగామ మండలం వెంకిర్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు ఎంత ధాన్యం వచ్చిందో, ఎంత కొనుగోలు చేశారో, హమాలీల సంఖ్య, గన్నీ బ్యాగులు, టార్పాలిన్‌ల అందుబాటు, లారీల రాకపోకలు, లోడింగ్‌కు తీసుకుంటున్న సమయం, ట్యాబ్ ఎంట్రీల విధానం తదితర వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. తేమ శాతం వచ్చిన వెంటనే ఎలాంటి ఆలస్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి కేంద్రానికి ఒక ట్రక్ కేటాయించామని, సరిపడా హమాలీలను ఏర్పాటు చేసి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాగ్ చేసిన మిల్లులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. మిల్లులకు వెళ్లే ప్రతి ట్రక్‌తో కేంద్రానికి సంబంధించిన ఒకరిని పంపించి అక్కడ ధాన్యం త్వరగా అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఓ.పి.ఎం.ఎస్ లో కొనుగోలు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ లో నమోదు చేయాలని సూచించారు. కేంద్ర నిర్వాహ కులు, ఏపీఎంలు, సీసీలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా చూడాలని కలెక్టర్ అన్నారు.

## బీసీ రాజ్యాధికార వేదిక పాదయాత్రకు బీసీల మద్దతు



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి: బీసీల బతుకులు మారాలని యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్న డిమాండ్‌లతో చేపట్టిన పాదయాత్రకు అపూర్వ స్పందన లభించింది. గురువారం రఘునాథ్ పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పాదయాత్రకు మాజీ ఎంపీపీ వై కుమార్ గౌడ్, జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్ ఋషి గంపల ఆంజనేయులు గౌడ్, సీనియర్ జర్నలిస్టు, బీసీ రాజ్యాధికార సమితి జనగామ జిల్లా ప్రచార కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేపడుతున్న రాఘవేందర్ గౌడ్ కు ఘనంగా సన్మానం చేశారు. అనంతరం వై కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బహుజనులంతా ఏకమై చట్టసభల్లో బీసీల సత్తా చాటుదామని ఆకాంక్షించారు. బహుజనుల ఐక్యమత్యంతోనే బీసీల రిజర్వేషన్లు సాధించుకోవడం దక్కుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## విద్య ప్రాధాన్యత పై కళాజాతలతో అవగాహన




జనగామ / లింగాల ఘణపురం , ప్రజాస్ఫూర్తి : విద్యా వారోత్సవాలలో భాగంగా బడి బాట కార్యక్రమా న్ని జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయి లో అవగాహన కార్య క్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో గురువారం లింగాల ఘణపురం మండలం నెలుట్ల గ్రామం లో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఇలానే జిల్లా లోని అన్ని గ్రామాలు, తండాలలో కళాజాత తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రతి బాలబాలిక తప్పనిసరిగా పాఠ శాలలో చేరాలని, విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవు తుందని కళాకారులు ప్రజలకు సందేశం అందించారు. బుర్ర కథలు, జానపద గేయాలు, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శ నలతో ప్రజలను ఆకట్టుకుంటూ పిల్లలను బడికి పంపాలని తల్లి దండ్రులను చైతన్యపరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య, ఆంగ్ల మాధ్యమ బోధన వంటి సౌకర్యాలను కళాకారులు తమ ప్రదర్శనల ద్వారా వివ రించారు.

# ఎస్సీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన



వనపర్తి, ప్రజాస్ఫూర్తిః వనపర్తి జిల్లా పరిధిలోని శ్రీరంగాపురం మండలంలో ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం 20252026 సంవత్సరంకు గాను దరఖాస్తులను పరిశీలించారు. గురువారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సంబంధిత అధికారులు దరఖాస్తులను పరిశీలించారు. ఎస్సీ కార్పొరేషన్ అధికారుల సమక్షంలో, ఎస్ బి ఐ శ్రీరంగపురం, పెబ్బేర్ మేనేజర్ లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శ్రీరంగాపురం మేనేజర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టారు. మండలంలోని 8 గ్రామ పంచాయతీలకు గాను 52 మంది దరఖాస్తు చేసుకోగా, 44 మంది హాజరయ్యారని, 8 మంది హాజర్ కాలేదని ఎంపీఓ రాజు తెలిపారు.

# జనగణన ప్రక్రియలో ప్రతి ఒక్క రూ భాగస్వాములవాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జనగణన 2027 లో భాగంగా నిర్వహిస్తున్న గృహ బాబితా, జనాభా గణన కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు. గురువారం నర్మెట్ట మండలంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి హౌస్ లిస్టింగ్ (ఇంటింటి సర్వే) ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్ల తో మాట్లాడి ప్రజల నుంచి ఖచ్చితమైన వివరాలను సేకరించాలని సూచించారు. సేకరించిన వివరాలన్నీ గోప్యంగా ఉంచబడతాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జనగణన ప్రక్రియ దేశాభివృద్ధికి ఎంతో ముఖ్యమని, ఇందులో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగ స్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించే ఇండ్ల గణన సర్వేను పారదర్శకంగా, నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.

# లింగారెడ్డిగూడెంలో బడిబాట



ప్రజాస్ఫూర్తి, షాద్‌నగర్ సర్కారు బడికి రండి.. చక్కగా చదువుకోండి.. అర్హత గల టీచర్లు చెప్పే విజ్ఞానాన్ని అందుకోండి.. అన్న నినాదాలతో ఫరూక్ నగర్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సదుపాయాలు కల్పించి విద్యార్థులను చక్కగా చదివించేందుకు ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవిశంకర్, వార్డు సభ్యులు వి. మల్లేష్, ఎర్రోళ్ల మమత, అరుణ్, రంగంపల్లి శశాంక్, ఎండి మెహరాజ్, అంగన్వాడి ఉపాధ్యాయులు మంజుల, అమృత, మాజీ ఉపసర్పంచ్ నరేందర్ రెడ్డి, గంటల శంకరయ్య, రంగంపల్లి వీరేష్ గౌడ్, ఎండి ఫకీర్ భాష, పక్కనే చిన్న నరసింహులు, రవి, హకీమ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ లో చేరిన షాద్‌నగర్ నాయకులు



ప్రజాస్ఫూర్తి షాద్‌నగర్: కవిత నాయకత్వంలోని టీఆర్ఎస్ పార్టీ రోజు రోజుకు పుంజుకుంటుందని, పార్టీ పెట్టిన కొన్ని రోజుల్లోనే పార్టీలో భారీగా చేరికలు జరుగుతున్నాయని ఆ పార్టీ షాద్ నగర్ ఇంచార్జ్ సీమల రమేష్ కురుమ అన్నారు. గురువారం షాద్ నగర్ బిజెపి పార్టీ టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంగన్న గౌడ్ ఆధ్వర్యంలో సుమారు 150 మంది వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీ లో చేరడానికి సీమల రమేష్ తో కలిసి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తుందని, రాబోయే రోజుల్లో మహిళలకు, విద్య వైద్య, ఉద్యమకారులకు ఒక దిక్సూచి ఇలా పార్టీ పనిచేస్తుందని అన్నారు. పార్టీలో చేరిన వారిలో బిజెపి టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంగన్న గౌడ్, సిండికేట్ కాలనీ ప్రెసిడెంట్ మల్లేష్, వైస్ ప్రెసిడెంట్ పవన్, బిజెపి సీనియర్ నాయకులు డి వెంకటయ్య, బిజెపి మహిళ అభ్యాన్ పరివార్ ఎన్.ప్రవీణ, బీఆర్ఎస్ నాయకులు ఎల్. శ్రీనివాస్ రెడ్డి, సూరారం మాజీ సర్పంచి దుర్గమ్మ, బీజేపీ టౌన్ మహిళా మోర్చా సభ్యులు ఎం. అర్చన, కాంగ్రెస్ నేత ఎల్. శ్రీకాంత్ రెడ్డి, శంకర్, ముత్యాలు, అంజమ్మ, ఎల్లయ్య, జి.అశోక్, మహేష్, అజిత్ మరో 100మందికి పైగా ఉన్నారు.

# వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా విద్యాధికారి యాదయ్య**

ప్రజాస్ఫూర్తి , జన్నారం : విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్యా వారోత్సవాలు సందర్భంగా జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు 6 నుంచి 9వ తరగతి చదువుతున్న పిల్లలను సమ్మర్ క్యాంపుకు పంపిస్తే ఒక స్కిల్ డెవలప్మెంట్ అవుతుందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐదుగురు విద్యార్థుల చొప్పున సమ్మర్ క్యాంపులో చేర్పించేలా కృషి చేయాలని సూచించారు. స్టోరీ టెల్లింగ్, నృత్యం, ఆర్ట్ క్రాఫ్ట్, డ్రాయింగ్, స్టిచ్చింగ్, టైలరింగ్ తిలకించి అత్యుత్తమ ప్రదర్శనలు చేసిన వారికి పెన్నులను బహుమానంగా అందజేశారు . 2026 27 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదు పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# కాంగ్రెస్ లో చేరిన బిజెపి కౌన్సిలర్ కీర్తి లవన్



సూర్యాపేట, ప్రజాస్ఫూర్తి : సూర్యాపేట మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ కీర్తి లవన్ బిజెపి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. గురువారం ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాదిల సమక్షంలో వార్డుకు చెందిన 100 మంది యువకులతో ఏకలిసి వచ్చి కాంగ్రెస్ పార్టీ కండువ కప్పుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్ల ను కేటాయించడం జరిగిందని రెండో విడతలో కూడా ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి నిరుపేదల కు అండగా నిలుస్తామన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధికి చేసింది శూన్యం అని ఆరోపించారు. మున్సిపల్ శాఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దనే ఉందని, జిల్లా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. పాత కొత్త నాయకులంతా కలసికట్టుగా ఉంటూ సూర్యాపేట పట్టణ అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పటిష్టతకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్ లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, గుణగంటి హేమ సతీష్, చిలుముల సునీల్ రెడ్డి, పొలగాని బాలు గౌడ్, నిమ్మల వెంకన్న, బొప్పాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రాచర్ల లక్ష్మి కాంతారావు మెమోరియల్ లయన్స్ విజన్ ఐ కేర్ సెంటర్ ప్రారంభం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణం లో హీరో షోరూం ఎండి రాచర్ల కమలాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాచర్ల లక్ష్మి కాంతారావు మెమోరియల్ నూతన విజన్ కేర్ సెంటర్ ను లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్ ప్రారంభించారు. ఇందులో ఐ కేర్, కంటి పరీక్షలు, కంటి సర్జరీ లు, డయాబెటిక్ టెస్ట్ లు , కంటి అద్దాలు నామమాత్రపు రుసుముతో ఇవ్వడం జరుగుతుందని లయన్ రాచర్ల కమలాకర్ తెలిపారు. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రేపాల మదన్ మోహన్ మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో లయన్స్ క్లబ్ విజ్ఞప్తి మేరకు రాచర్ల కమలాకర్ ఆధ్వర్యంలో ఐదు లక్షల రూపాయల వ్యయంతో అత్యాధునిక ఐ టెస్టింగ్ మెషిన్ ను ఏర్పాటు చేశారని , ఈ సెంటర్ పేదప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమం లో లయన్ రాచర్ల లక్ష్మి కమలాకర్ దంపతులు, ఎలక్ట్ గవర్నర్ కె వి ప్రసాద్, వైస్ గవర్నర్ కోడె సతీష్ కుమార్, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గుడిపూడి వెంకటేశ్వర రావు, దోసపాటి గోపాల్ మాజి ఎమ్మెల్యే, లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్, ఉప్పల రాజేంద్ర ప్రసాద్ సెక్రటరీ, మీలా మహదేవ్, కక్కిరేణి చంద్రశేఖర్, బండారు రాజా, చల్లా లక్ష్మీకాంత్, చల్లా లక్ష్మి ప్రసాద్, మిర్యాల సుధాకర్, రాచర్ల వెంకటేశ్వరరావు, రాచకొండ శ్రీనివాస్, పెద్దిరెడ్డి గణేష్, సవరాల సత్యనారాయణ, పోలబోయిన నర్సయ్య యాదవ్, గుండా లక్ష్మయ్య, యామా రామ్మూర్తి, హరి, భోనగిరి భాస్కర్, ఐ హాస్పిటల్ మేనేజర్ మల్లికార్జున్, డాక్టర్ హితేష్, విజన్ టెక్నిషియన్ బంగారు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# నేరేడ్‌మెట్‌లో చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు

**ఆర్మీ జవాన్ అరెస్ట్**



మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసును పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా నేరేడ్‌మెట్ పోలీసులు అల్వాల్ లోని డాల్ఫిన్ వైన్ షాప్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్ కడప జిల్లా సంబేపల్లె మండలం గోరవండ్లపల్లి గ్రామానికి చెందిన కుర్రపోతుల రెడ్డి శేఖర్ (31) ఆర్మీలో జనరల్ డ్యూటీ జవాన్‌గా పనిచేస్తూ అల్వాల్ లోని త్రిశూల్ లైన్ ఆర్మీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడి భారీ అప్పుల్లో కూరుకుపోయి అప్పులు తీర్చేందుకు డబ్బు కోసం మహిళల బంగారు గొలుసులు లాక్కోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం తన బజాజ్ పల్సర్ బైక్‌పై బయటకు వచ్చిన శేఖర్ డాల్ఫిన్ వైన్ షాప్ కు సమీపంలో తన బైక్ నంబర్ ప్లేట్‌ను AP 04 BX 7477 స్థానంలో నకిలీ స్టికర్ AP 04 AX 8474 గా మార్చాడు. అనంతరం సప్తగిరి కాలనీలో నివాసం ఉంటున్న జొన్నగడ్డ యోగేందర్ మణి మేఘల (57) అనే గృహిణిని లక్ష్యంగా చేసుకున్నాడు. అడ్రస్ అడుగుతున్నట్లు నటించి ఆమె మెడలో ఉన్న సుమారు 3 తులాల నల్లపూసల బంగారు గొలుసును లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో విచారణ చేపట్టి నిందితుడిని గుర్తించారు. అనంతరం పక్కా సమాచారంతో నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసును డీసీపీ మల్కాజిగిరి జోన్ శ్రీధర్ పర్యవేక్షణలో, ఏసీపీ మల్కాజిగిరి వి.యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్, ఎస్సై చంద్రశేఖర్ క్రైమ్ స్టాఫ్ బృందం కలిసి విచారణ చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రాబోయే బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. గురువారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. పండుగ సమయంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఇతర ప్రాంతాల సరిహద్దుల నుంచి జరిగే అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సమస్యల వలయంలో హుస్నాబాద్ మార్కెట్ యార్డు

- **పనిచేయని నిఘా నేత్రాలు**
- **నిరుపయోగంగా మారిన వే బ్రిడ్జ్ కాంట**
- **పట్టించుకోని మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు**






హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. మార్కెట్ యార్డులో ఎక్కడ సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దాదాపుగా 32 కెమెరాలను మార్కెట్ యార్డు చుట్టూ అమర్చిన ఫలితం లేకుండా పోయింది. ధాన్యం ఆరబోసి బయటికి వెళ్తే కనీసం రక్షణ లేకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సి సి కెమెరాలపై మార్కెట్ సిబ్బందిని వివరణ అడిగితే గత ఎనిమిది నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని చెప్పడం విడ్డురం. హుస్నాబాద్ మార్కెట్ యార్డులో నిఘాలోపం ఉందని తెలిసి కూడా పాలకవర్గం అధికారులు పట్టించుకోవడం లేదని, మరోవైపు రైతుల కోసం ఏర్పాటుచేసిన వే బ్రిడ్జి కాంటాక్ట్ కూడా కొన్ని రోజులుగా నిరుపయోగంగా ఉందని రైతుల ఆరోపిస్తున్నారు. ధాన్యాన్ని తూకం వేయాలంటే బయట వెళ్ళవలసిన పరిస్థితి ఉందని ప్రభుత్వ ధనంతో ఏర్పాటు చేసినటువంటి పరికరాలు పని చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ యార్డులో సమస్యలు చాలా ఉన్నాయని అందులో భాగంగా గన్ని బ్యాగులను బయట నుంచి కొనుక్కొని వస్తున్నామని కనీసం గన్ని బ్యాగులు కూడా ఇవ్వడం లేదని రైతులు వాపోయారు. ప్రభుత్వం ఏమో రైతుల పక్షపాతి అని పేరుకే చెప్పుకోవడం తప్ప ఇక్కడ చూస్తే పరిస్థితి వేరే విధంగా ఉంది. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ చూపి వెంటనే మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు పనిచేసేటట్లు చర్యలు తీసుకోవాలని మార్కెట్ యార్డ్ లో ఉన్నటువంటి సమస్యలపై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

# లింగందాన గ్రామంలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

ప్రజాస్ఫూర్తి , షాద్‌నగర్ : లింగందాన గ్రామం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి కృపతో ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మరియు మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, లింగం దాన సర్పంచ్ నాగిలా వెంకటేష్. ఉపసర్పంచ్ లావణ్య తిరుపతి రెడ్డి, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, పోల్గంగుట్ట సర్పంచ్ భాస్కర్ నాయక్, లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్, సుందరపూర్ సర్పంచ్ భారతి రవి నాయక్, మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచులు శేఖర్ పంతులు, యారం శేఖర్ రెడ్డి, కృష్ణయ్య, సీనియర్ నాయకులు గోగు వెంకట్ నారాయణ్ రెడ్డి, మాజీ ఎంపిటిసి రాంచందర్, ఉపసర్పంచులు యారం రామ్ రెడ్డి, ప్రమోద్ రెడ్డి, మాజీ ఉపసర్పంచులు మన్మధ రెడ్డి, రామ్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు భైర్కాన్ పల్లి నాయకులు శివ యాదవ్, నాగ రాజు, పల్లాటి క్రిష్ణ, శేరి శ్రీనివాస్ రెడ్డి, మురళి తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన అజయ్‌కుమార్ ను అభినందించిన ఎమ్మెల్యే శంకర్



ప్రజాస్ఫూర్తి షాద్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర రజక సహకార కార్పొరేషన్ చైర్మన్ గా దాసరిరాజు అజయ్ కుమార్ దామోదర సంజీవయ్య భవన్ లో గురువారం పదవి బాధ్యతల స్వీకరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయనను షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, ఫిషరీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి తదితరులు పాల్గొన్నారు.

# పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

ప్రజాస్ఫూర్తి, జన్నారం : పశువుల అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘాను




ఉంచామని, జిల్లా సరిహద్దుల గుండా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అధికారులకు మంచిర్యాల జిల్లా ఏసిపి ఆర్ ప్రకాష్ సూచించారు. జన్నారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కలమడుగు గ్రామం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్ పోస్ట్ ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువులను అక్రమంగా తరలించే వాహనాల తనిఖీ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుంచి జరిగే పశువుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా సరిహద్దు లో ఉండే రికార్డులను తనిఖీలు చేశారు.

# సింగరాయపేటలో టీబీ ముక్తి భారత్ అభియాన్



ప్రజాస్ఫూర్తి, జన్నారం : జన్నారం మండలం సింగరాయపేట గ్రామంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ సుధాకర్ నాయక్ ఆదేశాల మేరకు టీబీ ముక్తి భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. టీబీ వ్యాధి బారిన పడకుండా ఉండాలంటే ధూమపానం, మద్యపానం, చెడు వ్యసనాలు మానాలని వైద్యులు సూచించారు. టీబీ వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ, వ్యాధి సోకినపుడు తీసుకోవాల్సిన చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానితులకు ఎక్స్‌రేలు తీశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తొడసం రజితరామ్‌పాల్, ఉప సర్పంచ్ బట్టు వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ నవనీల, హెల్త్ అసిస్టెంట్లు కొల్లూరి కమలాకర్, ఎండి రషీద్, పద్మ, ఎక్స్‌రే టెక్నీషియన్ రాజేష్, లింక్ వర్కర్ సుధారాణి, ఆశా కార్యకర్తలు తిరుమల, సుజాత, సుమలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలి

* రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి




నల్లగొండ, ప్రజాస్పూర్తి : రబీలో దాన్యం ఎక్కువగా పండిన దృష్ట్యా ధాన్యం ఒకేసారి మార్కెట్ కు రావడం వల్ల లారీలు, హమాలీ తదితర సమస్యలు తలెత్తిన విషయం తమ దృష్టికి వచ్చిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. గురువారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఉదయాదిత్య భవన్లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా ధాన్యం సేకరణ సమీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు నల్గొండ జిల్లా వ్యాప్తంగా 67 శాతం దాన్యం సేకరణ పూర్తయినట్లు తెలిపారు. అంతేకాక యాసంగి సీజన్లో గాలి దుమారం ఎక్కువగా ఉంటుందని, దానివల్ల రైతులు ఇబ్బంది పడేందుకు అవకాశం ఉందని అన్నారు. గత సీజన్లో కొన్న దాన్యం గోదాములలో ఉండటం వల్ల ప్రస్తుత ధాన్యాన్ని నిలువ ఉంచుకునేందుకు స్థల భావం వల్ల మిల్లర్లకు ఇబ్బందిగా ఉందని, అయినప్పటికీ ఎన్ని ఇబ్బందులు వచ్చినా మిల్లర్లు కూడా రైతులను కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తంకుమార్ రెడ్డి , రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లు మాట్లాడారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్ లు ఆయా జిల్లాల వారీగా ధాన్యం సేకరణ వివరాలను సమావేశానికి తెలియజేశారు. ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ,దేవరకొండ శాసనసభ్యులు బాలు నాయక్, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు ,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నాగార్జునసాగర్శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ,ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, కోటిరెడ్డి, శంకర్ నాయక్,డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ,నల్గొండ నగర కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, రైతు కమిషన్ సభ్యులు,మూడు జిల్లాల ఎస్ పి లు,మార్కెట్ కమిటీ చైర్మన్ లు ,మున్సిపల్ చైర్మన్లు, తదితరులు ఈ సమీక్ష సమావేశానికి హాజరయ్యారు.

## సర్కార్ బడులను బలోపేతం చేసుకుందాం



హుస్నాబాద్, ప్రజాస్పూర్తి : సర్కారు బడులను బలోపేతం చేసుకొని గ్రామాలలో మన ఊరు మన పాఠశాల అనే అవగాహన ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని మీర్జాపూర్ గ్రామ సర్పంచ్ వేల్పుల సంపత్ కుమార్ అన్నారు. గురువారం గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు ప్రభుత్వమే ఉచితంగా కల్పించి విద్యను అందిస్తుందని తెలిపారు. మార్పు ఎక్కడినుండో మొదలవుతుంది కాదని అందరూ తలుచుకుంటే మార్పు ఇక్కడ నుండే మొదలవుతుంది అన్నారు. సర్కారు బడులను బతికించడానికి మనమందరం కలిసికట్టుగా పని చేయవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామ ప్రజలకు పిలుపునిచ్చారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వ్యవసాయ శాఖ డైరెక్టర్

కూసుమంచి ప్రజాస్పూర్తి: కూసుమంచి మండలంలోని జీళ్లచెరువు గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గురువారం వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి సందర్శించారు. రైతులతో కొనుగోలు గురించిన వివరాలు తెలుసుకున్నారు. రవాణా సమస్య ను 2,3 రోజులలో అధిగమిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సతీష్, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, పి ఏ సి ఎస్ చేగొమ్మ సెక్రటరీ రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్, జానీ, రవి కుమార్ రైతులు పాల్గొన్నారు.

## ఈ నెల 24న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలు

* పోస్టర్ ఆవిష్కరించిన మహాసభ కమిటీ సభ్యులు



ప్రజాస్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్ లో ఈనెల 24న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా 3వ మహాసభ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మహాసభల పోస్టర్ ను గురువారం కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. అనంతరం ఉదయ్ కుమార్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దుద్దుకూరి రామారావు మాట్లాడుతూ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ ల సంక్షేమ ధ్యేయంగా తమ సంఘం పనిచేస్తుందన్నారు. ఈనెల 24వ తేదీన కొత్తగూడెం క్లబ్ లో నిర్వహించనున్న యూనియన్ 3వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జర్నలిస్టులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యెర్రా ఈశ్వర్, ఏర్పుల సుధాకర్, బాపట్ల మురళి, భాస్కర్, షేక్ జానీ, బండ్ల వెంకట్, ఆర్విన్ రామానుజం, గుణ సురేష్, దశరధ్ రజువా, అఫ్జల్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్ర కళాశాల నూతన భవనానికి నిధులు సమకూరుస్తాం



ప్రజాస్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నూతన భవనం కోసం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సహకారంతో అవసరమైన నిధులను సమకూరుస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు. కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. పూర్ణచంద్ర రావు అధ్యక్షతన గురువారం జరిగిన పూర్వ విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కళాశాల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడటంతోపాటు, ప్రస్తుత భవనాలు విద్యార్థుల అవసరాలకు తగ్గట్టుగా తరగతి గదులుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. యూజీసీ నిధులతో నిర్మించిన భవనాన్ని బాలికల హాస్టల్ గా వినియోగించుకునేలా తక్షణమే అనుమతులు పొందాల్సిన అవసరం ఉందని, భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేస్తున్న కృషి కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు సందీప్, కార్యదర్శి కాసుల వెంకట్, సిపిఐ సంజీవరావు, ప్రముఖ న్యాయవాది రబ్, రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ ప్రసన్న కుమార్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పొరపాటులకు తావు లేకుండా కుటుంబ వివరాలు నమోదు చేయాలి

* స్థానిక సంస్థల అదన కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్పూర్తి : జనగణన-2027 గృహగణన కార్యక్రమంలో భాగంగా ప్రతి కుటుంబానికి సంబంధించిన వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం అనంతారం గ్రామంలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు నిర్వహిస్తున్న గృహగణన సర్వేను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి వివరాల నమోదు ప్రక్రియ, హౌస్ లిస్టింగ్ విధానం, కుటుంబాల వివరాల సేకరణ తదితర అంశాలను పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన 2027 అత్యంత కీలకమైందని తెలిపారు. సర్వే నిర్వహిస్తున్న ఎన్యూమరేటర్లు జనగణన నమోదు చేసేటప్పుడు తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. అందువల్ల ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను సరైన విధంగా అందించి సహకరించాలని కోరారు.

## యాదాద్రి జిల్లాలో ఆహార భద్రతపై తగిన చర్యలు

భువనగిరి, ప్రజాస్పూర్తి : ఆహార భద్రతపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధ్యక్షతన జిల్లా ఆహార పరిరక్షణ డెసిగ్నేటెడ్ ఆఫీసర్ పి. స్వాతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఆహార భద్రత సలహా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాసంస్థలు , హాస్టళ్లలో ఆహారాన్ని వండే సిబ్బందికి తక్షణమే ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పంపిణీ చేసే గుడ్లు, ఇతర ముడి సరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం ప్రధాన సమస్యగా మారిన పాల కల్తీపై ఆహార భద్రత అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి ఉమ్మడి దాడులు నిర్వహించి, కల్తీకి పాల్పడే వారిపై కఠినమైన కేసులు నమోదు చేయాలని సూచించారు. చిరు, మీడియం స్కేల్ వ్యాపారులు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ పొందాలని వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కూరగాయలు, పండ్ల సాగుకై పెస్టిసైడ్స్ వాడకం తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మనోహర్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, భువనగిరి రూరల్ సిఐ చంద్రబాబు మరియు పలు శాఖల జిల్లా అధికారులు, సలహా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నాం

* స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు




భువనగిరి, ప్రజాస్పూర్తి : నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని అనంతారం గ్రామం ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథి హాజరయ్యారు. విద్యా వారోత్సవాలలో భాగంగా పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, 100 శాతం హాజరు నమోదు చేసిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఇదే కార్యక్రమంలో విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పి.మదన్మోహన్ బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లిలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి అల్పాహారాన్ని అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ వరకు ఉచిత మధ్యాహ్న భోజనం అందించనున్నదని తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారి కందుల సత్యనారాయణ ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట ఉన్నత పాఠశాలలో పాల్గొని ఉత్తమ ఫలితాలు వస్తున్న ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులను కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో అధికారులు , ప్రజా ప్రతినిధులు,జిల్లా సెక్టోరియల్ అధికారులు పెసరు లింగారెడ్డి,షేక్ జానీ ఆఫ్టన్,సీ.హెచ్.రాధ, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కుక్కలు, కోతులను నివారించాలి



ప్రజాస్పూర్తి, కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న కుక్కలు, కోతుల నివారణకు తక్షణమే చర్యలు తీసుకొని వాటి నుంచి ప్రజలను రక్షించాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం డివిజన్ పరిధిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కుక్కలు, కోతులు పెద్దలు, చిన్న పిల్లలపై దాడులు చేస్తున్నా అధికారులు నిర్లక్ష్యంగా ఉండటం సరికాదని అన్నారు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బందిపై కూడా పలు సందర్భాల్లో కోతులు, కుక్కలు దాడి చేసినా అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయమని అన్నారు. పాల్వంచలో శిశువు తలను కుక్కలు తినడం దురదృష్టకరమని, అధికారులు ఇప్పటికైనా మేలుకొని కుక్కలు, కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఉద్యమం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు బెల్లం బేబీ, రావి శెట్టి పద్మ, రామ్ రాకేష్, వాసం బాబు, మార్తమ్మ, గుంజ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ విద్యలో మార్పులు..

## ఇకపై ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్



హైదరాబాద్: ఇంటర్మీడియట్ విద్యలో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఇకపై ఫస్టియర్‌లోనూ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీకి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌కు ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కులు కేటాయించనున్నారు. మ్యాథ్స్‌లోనూ యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టింది. మ్యాథ్స్‌లో 75కు బదులు 60 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ఒక్కో ఏడాదికి 15 మార్కులు కేటాయించనున్నారు. హ్యూమానిటీస్‌లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు 20 మార్కులు కేటాయిస్తారు. ఫైనల్ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే నిర్వహించనున్నారు. భాషా విభాగాల్లోనూ 100 మార్కులకు బదులు 80 మార్కులకు ఫైనల్ పరీక్షలు, 20 మార్కులు ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు కేటాయించనున్నట్లు ఇంటర్ బోర్డు వర్గాలు తెలిపాయి.

### మాజీ మంత్రి కేటీఆర్‌కు

## ఏసీబీ కోర్టు సమన్లు

హైదరాబాద్: ఫార్ములా ఈకార్ రేసు కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్‌రావుకు సమన్లు జారీ అయ్యాయి. జులై 31న విచారణకు రావాలని కోర్టు ఆదేశించింది. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈకార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ అభియోగపత్రంలో పేర్కొంది. ఇప్పటికే ఈ కేసులో కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలతో సహా ఎఫ్ఈఓ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించింది.

### నీట్ పేపర్ లీక్.. విద్యార్థుల భవిష్యత్తును

## నిర్వీర్యం చేసింది: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: విద్యార్థుల భవిష్యత్తును నీట్ పేపర్ లీక్ ఘటన నిర్వీర్యం చేసిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నీట్ రద్దు లక్షలాది విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగించిందని చెప్పారు. జాతీయ పరీక్షల విశ్వసనీయతను అన్నివిధాలా కాపాడాలన్నారు. పేపర్ లీక్‌లు, అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభావితమైన విద్యార్థులు, తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. పారదర్శక, కాలపరిమితితో కూడిన విచారణ జరపాలని కేంద్రాన్ని కోరుతున్నామని చెప్పారు. ఘటనలు పునరావృతం కాకుండా జవాబుదారీతనం ఉండాలన్నారు.

## కొనుగోళ్ల కేంద్రాల నిర్వహణ, రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి; వరి, మక్క జొన్న కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నెల్లికుదురు మండలం ఆలేరు గ్రామంలోని మణికంఠ రైస్ టెండర్స్ (రైస్ మిల్లును) మునిగలవీడు, నెల్లికుదురు గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ తదితర పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. నెల్లికుదురు నిర్వహిస్తున్న మొక్కజొన్న సేకరణ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని వరి,మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని భద్రపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.మరియన్న, డి సి ఓ వెంకటేశ్వర్లు, డి సి ఎస్ ఓ రమేష్, డి ఎం సి ఎస్ నరసింహారావు, ఎం ఎస్ ఓ, తహసీల్దార్, ఎంఈఓలు, పిఎసిఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందాం




కూసుమంచి ప్రజా స్పూర్తి: కూసుమంచి మండలం గురవాయిగూడెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బిక్షం నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గ్రామంలో భారీ ర్యాలీ తీశారు. సర్పంచ్ బిక్షం నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూల్లో తెలుగు,ఇంగ్లీష్ మీడియంలో మంచి క్రమశిక్షణ కలిగిన విద్య అందుతుందని అన్నారు. ప్రభుత్వ స్కూల్లోనే పిల్లల్ని చదివించి గవర్నమెంట్ పాఠశాలలు కాపాడుకుందాం అని గ్రామ సర్పంచి భిక్షం నాయక్ పేరెంట్స్ కి వివరించారు. అనంతరం పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలో లభించే నాణ్యమైన విద్య, క్రమశిక్షణ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గురువాయిగూడెం తండ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి వెంకటరమణ ,గురువాయిగూడెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం సతీష్ ,ఎస్. ఆంజనేయులు ,ఏ ఏ పి సి చైర్మన్ బొల్లంపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులపట్ల అన్నీ రాజకీయ పార్టీల వైఖరి తెలపాలి




ప్రజాస్పూర్తి, సూర్యాపేట: దళిత క్రైస్తవులకు ఎస్సి హోదా కల్పించాలని, అది రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి బిషప్ దుర్గం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బేతెస్థ ప్రార్ధన మందిరం లో సూర్యాపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రెవ ఏర్పుల క్రిస్టోఫర్ ఆధ్వర్యంలో జరిగిన దళిత క్రైస్తవ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గతంలో భారత ప్రభుత్వం రంగనాథ్ మిశ్రా జాతీయ కమిషన్ ను 2004 లో ఏర్పాటు చేయగా దళిత క్రైస్తవులు వివక్షను ఎదుర్కొంటున్నారని 2007లో ఆ కమిషన్ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిందని గుర్తు చేశారు. ఈ కమిషన్ నివేదికను వేంటనే అమలు చెయాలని డిమాండ్ చేశారు.1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలనీ అన్నారు. అన్నీ రాజకీయ పార్టీలు దళిత క్రిస్టియన్‌లపై తమ వైఖరిని స్పష్టంగ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ సి. హెచ్. శ్యామ్ ప్రసాద్, రెవ. డా. జలగం జేమ్స్, రెవ. బొక్క ఏలీయా రాజు, రెవ. డా. డి. జాన్ ప్రకాష్, రెవ. పంది మార్క్,పాస్టర్ కొండేటి లాజర్, పాస్టర్ ప్రేమ్ సాగర్,పిట్టల సామెల్,రెవ. సి. హెచ్. కిరణ్ కుమార్,యల్క ప్రభాకర్,మామిడి కృష్ణ, ఎన్.భాస్కర్, డి. రాజు,బాణాల సైమన్, విజయలక్ష్మి,ప్రేమ్ సాగర్, గెర్షోము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

దిల్లీ: భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు (Supreme court) కీలక వ్యాఖ్యలు చేసింది. నియామక ప్రక్రియలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని జస్టిస్ దీపాంకర్ దత్తా ప్రశ్నించారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, క్యాబినెట్ మంత్రితో కూడిన ప్యానెల్ ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకంపై నిర్ణయం తీసుకుంటోంది. నియామక ప్రక్రియపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ దత్తా పలు ప్రశ్నలు సంధించారు. సీబీఐ డైరెక్టర్ నియామక ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉన్నప్పుడు.. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు సజావుగా సాగేందుకు ఉద్దేశించిన ఎన్నికల సంఘంలో మాత్రం ఎందుకు ఉండకూడదు? అని ప్రశ్నించారు. ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని అనుకోవడం లేదని, అలాగని స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదని ధర్మాసనం ప్రశ్నించింది. 'ప్రధానమంత్రి ఒక వ్యక్తిని నియమిస్తే.. లోక్‌సభలో ప్రతిపక్ష నేత మరొకరిని నియమిస్తారు. ఇలా ఏకాభిప్రాయం కుదరనప్పుడు మూడో వ్యక్తిగా ఉన్న క్యాబినెట్ మంత్రి ప్రతిపక్ష నేతకు మద్దతు తెలుపుతారా? అని దీపాంకర్ దత్తా అటార్నీ జనరల్‌ను ప్రశ్నించారు. ఆచరణలో అన్ని సందర్భాల్లో అలా జరగకపోవచ్చంటూ అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి సమాధానమిచ్చారు. ప్రధానమంత్రి నిర్ణయాన్ని క్యాబినెట్ మంత్రి వ్యతిరేకించే అవకాశం లేనందున 2:1



మెజారిటీతో నియామకం జరిగిపోతోందని జస్టిస్ దీపాంకర్ దత్తా అన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్రని కేవలం 'అలంకారప్రాయం'గా మార్చేశారంటూ వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేయడమే కాదు, అది స్వతంత్రంగా ఉన్నట్లు ప్రజలకు కనిపించాలి కూడా అని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను కోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది.





## మోదీ పొదుపు మంత్రం..
# ఎడ్లబండిపై పోలీసు బరాత్

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు పాటించాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపునకు దేశవ్యాప్తంగా విశేష ఆదరణ వస్తోంది. ప్రముఖుల నుంచి సామాన్యుల వరకు ఇంధన ఆదా కోసం తమ వంతు కృషి చేస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ పోలీసు కానిస్టేబుల్ తన పెళ్లి బరాత్ కోసం వాహనాలను పక్కనబెట్టి ఎడ్లబండ్లను వినియోగించారు. నారాయణ్‌పుర్ ఎస్పీకి గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తోన్న కుబేర్ దెహారీకి రెండు రోజుల క్రితం వివాహమైంది. ఈ వివాహ వేడుక నిమిత్తం 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న వధువు నివాసానికి కుబేర్ కుటుంబం ఎడ్ల బండ్లపై ఊరేగింపుగా వెళ్లింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై ఆయన మాట్లాడుతూ .. '' ప్రధాని పిలుపు కేవలం ప్రకటన మాత్రమే కాదు. దేశ ప్రయోజనాల కోసం ఇచ్చిన సందేశం. దాన్ని ప్రతి ఒక్కరూ పాటిస్తే ఇంధన ఆదాలో దేశం మరింత బలోపేతమవుతుంది'' అని తెలిపారు. కుబేర్ నిర్ణయాన్ని మెచ్చుకుంటూ రాష్ట్రమంత్రి కేదార్ కశ్యప్ ఎక్స్‌లో ఆయన ఫొటోలను షేర్ చేశారు. ''ప్రధాని పిలుపు గ్రామాలకు కూడా చేరింది. ఎడ్లబండిపై కుబేర్ బరాత్ నిర్వహించుకోవడం అనేది కేవలం పర్యావరణ పరిరక్షణలో భాగం మాత్రమే కాదు.. మన సంస్కృతి సంప్రదాయాలను చాటిచెప్పడమే'' అని రాసుకొచ్చారు.

# శబరిమల కేసులో 16 రోజుల విచారణ.. తీర్పు రిజర్వ్ చేసిన సుప్రీం

'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళల పట్ల వివక్ష' కేసులో సుప్రీంకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో గురువారం సర్వోన్నత న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. మే 29



లోగా లిఖిత పూర్వక వాదనలు సమర్పించవచ్చని పేర్కొంది. మొత్తం 16 రోజుల పాటు విస్తృత ధర్మాసనం పిటిషనర్ల వాదనలు విన్నది. శబరిమలలో 10-50 ఏళ్ల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ వయసు మహిళలకు ఆలయంలోకి ప్రవేశం నిరాకరణ.. అంటరానితనంగా, రాజ్యాంగ అధికరణం 17కు ఉల్లం ఘనగా ఉందని నాడు అత్యున్నత న్యాయస్థానం అభివర్ణించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. దీంతో ఈ అంశాన్ని విస్తృత ధర్మాసనానికి బదిలీ చేస్తూ 2019 నవంబరులో నాటి సీజేఐ జస్టిస్ రంజన్ గొగొయ్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో విస్తృత రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది.

# మూడో దశ ఎస్ఐఆర్.. ఏపీ, తెలంగాణలో ఎప్పుడంటే..?

దిల్లీ: మూడో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. ఏపీ, తెలంగాణతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనుంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, ఝార్ఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, ఉత్తరాఖండ్, త్రిపుర ఉన్నాయి. ఈ దశలో 3.94 లక్షల మందికిపైగా బూత్ స్థాయి అధికారులు.. 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు వెళ్లనున్నారు. డిసెంబర్ 23న త్రిపురతో మూడో దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియనుంది. ఎస్ఐఆర్‌కు సహకరించాలని




అన్ని రాజకీయ పార్టీలకు ఈసీ విజ్ఞప్తి చేసింది. ఏపీలో జూన్ 5 నుంచి 14 వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. అదే నెల 15 నుంచి జులై 14 వరకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించనున్నారు. అనంతరం జులై 21న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు. తెలంగాణలో జూన్ 15 నుంచి 24 వరకు సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే చేపడతారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటించి.. అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు.



## బీభత్సం సృష్టించిన గాలి దుమారం..
# యూపీలో 111కి చేరిన మృతులు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో తీవ్ర గాలి దుమారం, భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. బుధవారం సంభవించిన ఈ ప్రకృతి వైపరీత్యానికి రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల జరిగిన ఘటనల్లో ఇప్పటివరకు 111 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. పలు జిల్లాల్లో 72మంది గాయపడగా.. అనేక చోట్ల చెట్లు కూలడం, ఇళ్లు ధ్వంసమైన ఘటనలు చోటుచేసుకున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాలు, ఉరుములు, మెరుపుల కారణంగా జరిగిన ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని అంచనా వేయాలని, బాధిత కుటుంబాలకు 24గంటల్లోగా సహాయం అందేలా చూడాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. మే 13న చోటుచేసుకున్న గాలిదుమారం ధాటికి 26 జిల్లాల్లో 111 మరణాలు సంభవించినట్లు తమకు సమాచారం అందినట్లు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. మొత్తంగా 72 మంది గాయపడగా.. 170 మూగజీవాలు మరణించాయని, 227 ఇళ్లు ధ్వంసమైనట్లు ఆయన తెలిపారు. తాజా పరిస్థితిపై జిల్లా అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. ఆయా జిల్లాల్లో ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

# ఎర్రకోట పేలుడు వెనుక 'ఆపరేషన్ హెవెన్లీ హింద్'..
## ఛార్జ్‌షీట్‌లో కీలక విషయాలు

గతేడాది యావత్ దేశాన్ని ఉలికిపాటుకు గురిచేసిన దిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తాజాగా ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో కేసుకు (Delhi Red Fort Blast) సంబంధించిన పలు కీలక విషయాలను ప్రస్తావించింది. ఈ ఘటనలో నిందితులకు అల్‌ఖైదా అనుబంధ సంస్థతో సంబంధాలున్నాయని పేర్కొంది. 'ఆపరేషన్ హెవెన్లీ హింద్'లో భాగంగా నిందితులు ఈ పేలుడుకు పాల్పడినట్లు వెల్లడించింది. 2025 నవంబరు 10న దేశ రాజధాని దిల్లీ (Delhi) లోని చారిత్రక ఎర్రకోట వద్ద కారు బాంబు పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. ఈ కేసులో ఎన్ఐఏ (NIA) 7500 పేజీల ఛార్జ్‌షీట్‌ను రూపొందించి గురువారం దిల్లీ కోర్టుకు సమర్పించింది. ప్రధాన సూత్రధారి ఉమర్ ఉన్ నబీతో (పేలుడులో అతడు మరణించాడు) పాటు మొత్తం 10 మందిని నిందితులుగా చేర్చింది. దర్యాప్తులో భాగంగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీలో ఎన్ఐఏ సోదాలు జరిపింది. 588 మంది నుంచి వాంగ్మూలాలు నమోదు చేసింది. 395కు పైగా పత్రాలు, 200కు పైగా స్వాధీనం చేసుకున్న పరికరాల నుంచి సాక్ష్యాలు సేకరించినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ పేలుడు వెనుక జిహాదీ కుట్ర కోణం ఉన్నట్లు ఫోరెన్సిక్, సాంకేతిక ఆధారాలు స్పష్టంచేశాయని



దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ కేసులో ఇప్పటివరకు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసింది. అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ అనుబంధ సంస్థ అన్సార్ గజ్వా-ఉల్ హింద్‌తో నిందితులకు సంబంధాలున్నాయని ఎన్ఐఏ తెలిపింది. వీరంతా 2022లో శ్రీనగర్‌లో సమావేశమయ్యారని, అక్కడే ఓ కొత్త ముఠాను ఏర్పాటుచేసినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. భారత్‌లో ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు వీరు కుట్రలు పన్నినట్లు దర్యాప్తులో గుర్తించింది. దీనికి 'ఆపరేషన్ హెవెన్లీ హింద్' అని పేరు పెట్టినట్లు తెలిపింది.

**ల్యాబ్‌ల్లో మదర్ ఆఫ్ సైతాన్..**

ఈ ఆపరేషన్‌లో భాగంగా నిందితులు ఉగ్ర కుట్రల కోసం కొత్త నియామకాలు చేపట్టారని, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిల్వ చేసుకోవడంతో పాటు పేలుడు పదార్థాలను సొంతంగా తయారుచేసుకున్నట్లు ఎన్ఐఏ తెలిపింది. వైద్యవృత్తిలో ఉన్న నిందితులు వక్రమార్గం పట్టి తమ నైపుణ్యాలను పేలుడు పదార్థాల తయారీకి వినియోగించారు. తమ నివాస స్థలాలు, ల్యాబ్‌లను హబ్‌లుగా మార్చుకున్నారు. అత్యంత ప్రమాదకరమైన పేలుడు పదార్థంగా పేర్కొనే ట్రైఅసిటోన్ ట్రైపెరాక్సైడ్ (టీఏటీపీ)ని కూడా వీరు ల్యాబ్‌లో తయారుచేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో గుర్తించింది. దీన్ని మదర్ ఆఫ్ సైతాన్‌గా పిలుస్తారు. జమ్మూకశ్మీర్‌తో పాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లోని భద్రతా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేయాలని వీరు కుట్రలు చేసినట్లు ఎన్ఐఏ తెలిపింది. ఇందుకోసం రాకెట్లు, డ్రోన్ ఆధారిత ఐఈడీలతో ప్రయోగాలు కూడా చేసినట్లు ఛార్జ్‌షీట్‌లో వెల్లడించింది.

# మరో బెంచ్‌కు కేజ్రీవాల్ కేసు బదిలీ

**: జస్టిస్ స్వర్ణకాంత శర్మ**

దిల్లీ మద్యం విధానం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. దిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ స్వర్ణకాంత శర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. తనను లక్ష్యంగా చేసుకొని కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా సహా పలువురు ఆప్ నేతలు చేసిన ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించిన ఆమె.. ఈ కేసు విచారణను మరొక ధర్మాసనానికి బదిలీ చేస్తున్నట్లుగా ప్రకటించారు.



కేజ్రీవాల్ ఒక పథకం ప్రకారమే తనకు వ్యతిరేకంగా క్యాంపెయిన్ నడిపారని జస్టిస్ స్వర్ణకాంత శర్మ అన్నారు. తనకు రాజకీయపరమైన విధేయతను ఆపాదిస్తూ కోర్టును లక్ష్యంగా చేసుకుంటూ సోషల్ మీడియా పోస్టులు పెట్టారంటూ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ కేసు నుంచి తప్పుకొనేందుకు నిరాకరించిన తర్వాత కేజ్రీవాల్ చట్టపరంగా ముందుకెళ్లడానికి బదులుగా తన ప్రతిష్ఠను దెబ్బకొట్టాలని చూశారన్నారు. వాక్ స్వాతంత్ర్యం ముసుగులో న్యాయ వ్యవస్థను తక్కువ చేసే ప్రయత్నాలను అనుమతించలేమన్నారు. మరోవైపు, సీబీఐ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. సంస్థ గౌరవాన్ని నిలబెట్టారంటూ స్వర్ణకాంత శర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

# మోదీ పిలుపు.. దిల్లీలో వారానికి 2 రోజులు వర్క్‌ఫ్రమ్ హోమ్

పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ఇంధన పొదుపు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో దిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజుల వర్క్‌ఫ్రమ్ హోమ్ ప్రకటించింది. దీంతో పాటు ప్రభుత్వ విభాగాల్లో ఇంధన వినియోగాన్ని తగ్గించేలా 'నో వెహికల్ డే', ఆన్‌లైన్ సమావేశాల వంటి చర్యలు చేపట్టింది. ఈ మేరకు దిల్లీ సీఎం రేఖా గుప్తా గురువారం మీడియా సమావేశంలో తెలిపారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు.

మోదీ పొదుపు మంత్రం వేళ.. ఇప్పటికే సీఎం రేఖా గుప్తా తన కాన్వాయ్‌లో వాహనాల సంఖ్యను నాలుగుకు తగ్గించుకున్నారు. అందులో రెండు విద్యుత్ వాహనాలే.ఇంధన ఆదాకు దిల్లీ చర్యలు ఇలా..

ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు వారానికి రెండు రోజులు ఇంటి నుంచి పనిచేయాలి.

50శాతం అధికారిక సమావేశాలు ఆన్‌లైన్‌లో నిర్వహించాలి.

అధికారిక వాహనాల వినియోగాన్ని తగ్గించేలా.. మంత్రిత్వ శాఖ అధికారులు ప్రతి సోమవారం మెట్రోలో ప్రయాణించి ఆఫీసులకు



రావాలి. ఇందుకోసం ఉద్యోగుల ప్రయాణ భత్యం 10శాతం పెంపు.

అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్ నెలవారీ కోటాలో 20శాతం తగ్గింపు. ఆరు నెలల వరకు దిల్లీ ప్రభుత్వం ఎలాంటి కొత్త వాహనాల కొనుగోలు చేపట్టొద్దు.

ఏడాది వరకు మంత్రులు గానీ, ప్రభుత్వ అధికారులు గానీ ఎలాంటి విదేశీ పర్యటనలకు వెళ్లొద్దు. మూడు నెలల పాటు ఆర్భాటమైన ప్రభుత్వ కార్యక్రమాలు చేయకూడదు.

ప్రజా రవాణాను ప్రోత్సహించేలా.. ప్రభుత్వ సిబ్బంది నివాసముండే 29 కాలనీలకు 58 ప్రత్యేక బస్సుల నిర్వహణ. రద్దీని తగ్గించి ఇంధనం ఆదా చేసేలా ప్రభుత్వ కార్యాలయాల పనివేళల్లో మార్పులు చేయాలని దిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది.

## చక్కెర ఎగుమతులపై భారత్ నిషేధం..

### అంతర్జాతీయంగా పెరగనున్న ధరలు



**న్యూఢిల్లీ:** చక్కెర ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు అమలులో ఉంటుందని కేంద్రం తెలిపింది. ఈ మేరకు బుధవారం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశంలో చక్కెర ధరల్ని నియంత్రించే లక్ష్యంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చక్కెరతోపాటు చక్కెర ఉత్పత్తి చేసే చెరుకు వంటి ముడి పదార్థాల ఎగుమతుల్ని కూడా కేంద్రం నిషేధించింది.

ఇటీవలి కాలంలోచక్కెర ఉత్పత్తి తగ్గిపోతోంది. దీంతో ధరలు పెరుగుతున్నాయి. అందుకే కేంద్రం ఈ అంశంపై స్పందించింది. విదేశాలకు భారత చక్కెర ఎగుమతులు నిలిపివేయడంతో అంతర్జాతీయంగా చక్కెర ధరలు పెరిగే అవకాశాలున్నట్లు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. చక్కెరతోపాటు, సంబంధిత ముడి పదార్థాల ధరలు కూడా అంతర్జాతీయంగా పెరగొచ్చని అంచనా. ఇదే సమయంలో ఇండియాతోపాటు చమురు ఎగుమతుల్లో కీలకంగా ఉన్న బ్రెజిల్, థాయ్‌లాండ్ వంటి దేశాలకు మంచి వ్యాపార అవకాశాలు దక్కే ఛాన్స్ ఉంది. భారత చక్కెర లేని లోటుని, ఆ దేశాలు తమ దగ్గర ఉత్పత్తైన చక్కెరను అందించి భర్తీ చేయొచ్చు. దీనివల్ల ఆయా దేశాలకు ఆసియా, ఆఫ్రికా మార్కెట్లలో చక్కెర ఎగుమతులపై మంచి పట్టు దొరికే ఛాన్స్ ఉంది.

ప్రపంచంలోనే ఇండియా రెండో అతిపెద్ద చక్కెర ఎగుమతిదారు. ఈ ఏడాది 1.59 మిలియన్ మెట్రిక్ టన్నుల చక్కెర ఎగుమతులకు కేంద్రం అనుమతించింది. ఇదే సమయంలో దేశంలో తగినంత చక్కెర ఉత్పత్తి జరిగి, ఇక్కడ ధరలు అందుబాటులో ఉంటాయని భావించింది. అయితే, పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చక్కెర ఎక్కువగా పండించే అనేక ప్రాంతాల్లో ఈసారి వాతావరణ మార్పులు సహా వివిధ కారణాలతో దిగుబడి తగ్గింది. దీంతో తగినంతగా చమురు ఉత్పత్తి జరగడం లేదు. మార్కెట్ వర్గాల ప్రకారం.. 8 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెర ఉత్పత్తికి ఒప్పందం కుదరగా, 6 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే ఎగుమతి జరిగింది. ఈ నిషేధం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఇప్పటికే లోడింగ్ ప్రారంభమైన వాటికి మాత్రం వర్తించదు.

## వరుసగా రెండో రోజూ మార్కెట్ల జోరు

### ప్రభుత్వ చర్యల అంచనాలతో పెరిగిన సెంటిమెంట్..

### ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగాల్లో బలమైన కొనుగోళ్ల మద్దతు

### అమ్మకాల ఒత్తిడితో 2 శాతం మేర నష్టపోయిన ఐటీ రంగం

### కరెన్సీ అస్థిరతను అరికట్టేందుకు ప్రభుత్వ చర్యల అంచనాలతో పెరిగిన సెంటిమెంట్

### రోజులో ఒడుదొడుకులకు లోనై చివరికి పుంజుకున్న రూపాయి



**ముంబై:** భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ లాభాలను నమోదు చేశాయి. గురువారం ట్రేడింగ్‌లో ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. కరెన్సీ అస్థిరతను నియంత్రించేందుకు ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 789.74 పాయింట్లు (1.06%) పెరిగి 75,398.72 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277 పాయింట్లు (1.18%) లాభపడి 23,689.60 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 1,073 పాయింట్ల వరకు లాభపడగా, నిఫ్టీ 364 పాయింట్ల మేర పెరిగింది.

రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 2.74 శాతం, నిఫ్టీ హెల్త్‌కేర్ 2.56 శాతంతో టాప్ గెయినర్లుగా నిలిచాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే, టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతం నష్టపోయింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి ప్రధాన ఐటీ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బాండ్లపై పన్నుల విధానాన్ని సులభతరం చేయడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్న వార్తలతో మార్కెట్లు పుంజుకున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో, ట్రంప్-షీ సమావేశం తర్వాత మెరుగైన అంతర్జాతీయ ఆర్థిక సహకారంపై ఆశలు కూడా సానుకూల ప్రభావం చూపాయి.

## జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ



**ముంబై:** భారత వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీ పెద్ద కుమారుడు ఆకాశ్ అంబానీని జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. రిలయన్స్‌కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9 నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలంపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7న సమర్పించిన ఫైలింగ్ లో పేర్కొన్నది.

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016 లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదుచేసింది.

# పంజాబ్‌పై ముంబై ట్రిల్లింగ్ విక్టరీ

### తిలక్ వర్మ డైనమిక్ బ్యాటింగ్..

### పంజాబ్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్ విజయం

### 201 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.5 ఓవర్లలో ఛేదించిన ముంబై

### కేవలం 33 బంతుల్లో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచిన తిలక్ వర్మ



**ధర్మశాల:** ధర్మశాల వేదికగా జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఖరి ఓవర్లో ఛేదించింది. యువ బ్యాటర్ తిలక్ వర్మ (75లి) అజేయ అర్ధ శతకంతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించగా, బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో సత్తా చాటాడు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ముంబై ముందు పంజాబ్ 201 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (32 బంతుల్లో 57) హాఫ్ సెంచరీతో మెరవగా, చివర్లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (17 బంతుల్లో 38) మెరుపు ఇన్నింగ్స్‌తో స్కోరును 200కు చేర్చాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 39 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి పంజాబ్ జోరుకు అడ్డుకట్ట వేశాడు.

భారీ లక్ష్య ఛేదనలో ముంబైకి ఓపెనర్ రియాన్ రికెల్టన్ (23 బంతుల్లో 48) అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. మధ్యలో స్వల్ప వ్యవధిలో వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడినప్పటికీ, క్రీజులోకి వచ్చిన తిలక్ వర్మ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. కేవలం 33 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి విల్ జాక్స్ (10 బంతుల్లో 25లి) చక్కటి సహకారం అందించడంతో ముంబై మరో బంతి మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది.

టోర్నీ నుంచి ఇప్పటికే ఎలిమినేట్ అయిన ముంబై ఇండియన్స్ ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ అవకాశాలను దెబ్బతీసింది. పంజాబ్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉన్నప్పటికీ, ఇతర మ్యాచ్ ల ఫలితాలు ఆ జట్టు అవకాశాలపై ప్రభావం చూపుతాయి.

## చెన్నై స్క్వాడ్‌లో సఫారీ కుర్రాడు..

### ప్లే ఆఫ్స్ ఆశల్ని నిలబెడుతాడా..!

**చెన్నై:** ప్లే ఆఫ్స్ పరుగులో నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ స్క్వాడ్‌లో మార్పులు చేసింది. గాయంతో టోర్నీ మొత్తానికి దూరమైన పేసర్ జేమీ ఓవర్టన్ స్థానంలో యువ ఆల్‌రౌండర్‌ను తీసుకుంది. ఈ ఏడాదే అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన దక్షిణాఫ్రికా కుర్రాడు డియాన్ ఫొరెస్టర్‌తో సీఎస్కే ఒప్పందం చేసుకుంది. స్క్వాడ్‌లోకి ఆహ్వానిస్తూ పోస్ట్ పెట్టింది.

లీగ్ దశ ఆఖర్లో పుంజుకొని ప్లే ఆఫ్స్‌పై గురి పెట్టిన చెన్నై సూపర్ కింగ్స్.. ఆల్‌రౌండర్ ఓవర్టన్ సేవల్ని కోల్పోయింది. గాయం కారణంగా చికిత్స కోసం అతడు స్వదేశానికి వెళ్లడంతో కొత్త కుర్రాడిని స్క్వాడ్‌లో చేర్చుకుంది సీఎస్కే. ఎడమ చేతివాటం పేసర్‌గా రాణిస్తున్న డియాన్ ఫొరెస్టర్‌ను రూ.75 లక్షలకు తీసుకుంది.

ఇటీవల టీ20ల్లో బ్యాటుతో, బంతితో గొప్పగా రాణిస్తున్న డియాన్.. ఓవర్టన్ తరహాలో జట్టు విజయాల్లో భాగమవ్వాలని చెన్నై ఫ్రాంచైజీ కోరుకుంటోంది. ప్రస్తుతం చెన్నై 12 పాయింట్లతో ఐదో స్థానంలో కొనసాగుతోంది. మే 15న లక్నో సూపర్ జెయింట్స్‌ను ఓడిస్తే చెన్నై ప్లే ఆఫ్స్ అవకాశాలు మెరుగుపడినట్టే.

పొట్టి క్రికెట్‌లో విశేషంగా రాణిస్తున్న



డియాన్ ఫొరెస్టర్ దక్షిణాఫ్రికా క్రికెట్‌లో నయా సంచలనంగా మారాడు. ఆల్‌రౌండర్‌గా అదరగొడుతున్న ఈ యంగ్‌స్టర్ ఈ ఏడాది న్యూజిలాండ్ పర్యటనతో అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగు పెట్టాడు. స్వదేశంలో నిర్వహించే ఎస్ఏ20లో జోబర్గ్ సూపర్ కింగ్స్‌కు డియాన్ ప్రాతినిధ్యం వహించాడు.

జేఎస్కే తరఫున ఎనిమిది మ్యాచుల్లో 165.09 స్ట్రయిక్ రేటుతో 175 రన్స్ కొట్టాడీ చిచ్చరపిడుగు. ముంబై కేప్‌టౌన్‌పై అజేయంగా 82 రన్స్‌తో దుమ్మురేపాడు. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో రావల్పిండి జట్టుకూ ఆడిన డియాన్ ఆకట్టుకున్నాడు.

## భారత 'ఏ' జట్టులో వైభవ్..

### ఐపీఎల్ స్టార్లకూ పిలుపు..!



**న్యూఢిల్లీ:** అండర్-19 క్రికెట్‌లో, ఐపీఎల్‌లో ప్రకంపనలు రేపుతున్న వైభవ్ సూర్యవంశీ భారత 'ఏ' జట్టులోకి వచ్చేశాడు. ధనాధన్ ఆటతో ప్రపంచస్థాయి బౌలర్లను భయపెడుతున్న ఈ చిచ్చరపిడుగు శ్రీలంక పర్యటనకు ఎంపికయ్యాడు. ముక్కోణపు సిరీస్ కోసం గురువారం సెలెక్టర్లు తిలక్ వర్మ కెప్టెన్‌గా పదిహేను మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. వైభవ్‌తో పాటు ఐపీఎల్‌లో మెరుస్తున్న నిశాంత్ సింధు, అన్షుల్ కంబోజ్‌లు స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు.

పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ అనంతరం భారత కుర్రాళ్లు శ్రీలంకలో అడుగు పెట్టనున్నారు. జూన్‌లో శ్రీలంక గడ్డపై భారత్, అఫ్గనిస్థాన్ మధ్య జరుగనున్న ముక్కోణపు సీరీస్‌లో తమ తడాఖా చూపించనున్నారు. ఈ ట్రై సిరీస్ కోసం గురువారం సెలెక్టర్లు తిలక్ వర్మ సారథిగా, రియాన్ పరాగ్ వైస్ కెప్టెన్‌గా స్క్వాడ్‌ను ప్రకటించారు. గత ఏడాది నుంచి శతకాల మోతతో ఔరా అనిపిస్తున్న వైభవ్.. పంతొమ్మిదో సీజన్‌లో అదరగొడుతున్న ప్రియాన్స్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్‌లు టాపార్డర్ బ్యాటర్లుగా ఎంపికయ్యారు. సూర్యాన్ష్ షెడ్గే, నిషాంత్ సింధుతో పాటు.. పేసర్లు అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్‌లకు చోటు లభించింది.

సిరీస్ విషయానికొస్తే.. జూన్ 9న ఆతిథ్య శ్రీలంకను దంబుల్లా స్టేడియంలో భారత ఏ జట్టు ఢీ కొట్టనుంది. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగే ఈ సిరీస్‌లో టాప్-2లో నిలిచిన జట్లు జూన్ 21న ఫైనల్లో తలపడతాయి. ఈ పర్యటనలోనే లంక ఏ జట్టుతో టీమిండియా రెండు మల్టీ డే మ్యాచ్‌లు ఆడనుంది. అయితే.. ఈ మ్యాచ్‌లకు స్క్వాడ్‌ను ప్రకటించాల్సి ఉంది.

**భారత 'ఏ' జట్టు స్క్వాడ్:** తిలక్ వర్మ (కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్, రియాన్ పరాగ్(వైస్ కెప్టెన్), అయుశ్ బదోని, నిషాంత్ సింధు, హర్ష్ దూబే, సూర్యాన్ష్ షెడ్గే, కుమార్ కుషగ్ర(వికెట్ కీపర్), విప్రజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్‌వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్.

## ఒకే సీజన్‌లో ముగ్గురికి పగ్గాలు..?

### ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా బుమ్రా..

**ముంబై:** పంతొమ్మిదో సీజన్‌లో ఘోరమైన ఆటతో టోర్నీ నుంచి నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ ఇక పరువు కోసం పోరాడనుంది. పోతూ పోతూ ఇతర జట్ల ప్లే ఆఫ్స్ అవకాశాలను దెబ్బతీయాలనుకుంటోంది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు సైతం కెప్టెన్ హార్దిక్ పాండ్యా అందుబాటులో ఉండడం లేదు. అలానే తాత్కాలిక నాయకుడు సూర్యకుమార్ యాదవ్ సైతం దూరం కానున్నాడు. ఈ నేపథ్యంలో పేసర్ జస్ప్రీత్ బుమ్రా ముంబై సారథిగా వ్యవహరించనున్నాడని సమాచారం. అదే జరిగితే.. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు సారథులతో ఆడిన రికార్డు ముంబైకి సొంతమవ్వనుంది.

ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ పంతొమ్మిదో సీజన్‌లో ఏదీ కలిసి రాలేదు. జట్టు నిండా స్టార్లు, టీ20 వరల్డ్ కప్ విజేతలు ఉన్నా సరే అనూహ్యంగా లీగ్ దశను దాటలేదు ముంబై. కెప్టెన్ హార్దిక్ పాండ్యా వ్యూహాలు, పేలవ ఫామ్ అందుకు ఓ కారణం కాగా.. మిస్టర్ 360 సూర్యకుమార్ యాదవ్ వైఫల్యం ముంబైని దెబ్బతీశాయి. దాంతో.. గత రెండు మ్యాచ్‌లకు పాండ్యాను పక్కన పెట్టిన ముంబై సూర్యకు పగ్గాలు అప్పగించినా ఫలితం మారలేదు. ఒకప్పుడు ప్రత్యర్థులను గడగడ వణికించిన ముంబై.. ఈసారి ఎనిమిది ఓటములతో టోర్నీ నుంచి నిష్క్రమించడాన్ని యాజమాన్యం, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో మిగిలిన మ్యాచులన్నీ గెలిచి పరువు కాపాడుకోవాలనుకుంటున్న ముంబైని మూడో కెప్టెన్ నడపించడం ఖాయమనిపిస్తోంది. అవును.. గురువారం ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌కు పాండ్యా, తాత్కాలిక సారథి సూర్యకుమార్ యాదవ్ ఇద్దరూ అందుబాటులో ఉండడం లేదు. వీరిద్దరు జట్టుతో కలిసి నెట్స్‌లో పాల్గొనకపోవడమే అందుకు కారణం. దాంతో.. ఐదుసార్లు ట్రోఫీ అందించిన



రోహిత్ శర్మ ఉన్నప్పటికీ బుమ్రా లేదంటే తిలక్ వర్మలో ఒకరికి పగ్గాలు అప్పగిస్తారని సమాచారం.

సీనియరైన బుమ్రాకే యాజమాన్యం, కోచ్ మహేల జయవర్ధనే ఓటేసే అవకాశముంది. ఒకవేళ టాస్‌కు బుమ్రా వస్తే ఒకే సీజన్‌లో ముగ్గురు సారథులతో ఆడిన జట్టుగా ముంబై రికార్డు పట్టేయనుంది. 2013 నుంచి.. ఇప్పటివరకూ అంటే 13 ఏళ్లుగా ఫ్రాంచైజీ కోసం తన చెమటను ధార పోసిన అతిడికే పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించినా ఆశ్చర్యమేమీ లేదు.

పాండ్యాను అమ్మేస్తారా..!

ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్‌గా రాణించి.. కెప్టెన్‌గా ఎదిగిన హార్దిక్ పాండ్యా భవితవ్యం ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది. గుజరాత్ టైటాన్స్‌కు అరంగేట్రంలోనే ట్రోఫీ అందించి.. ఆ తర్వాతి ఎడిషన్‌లో రన్నరప్‌గా నిలిపిన పాండ్యా ముంబై తరఫున అట్టర్‌ఫ్లాప్ అయ్యాడు. రెండు సీజన్లలోనూ అటు సారథిగా, ఇటు ఆటగాడిగా అతడు మెప్పించలేకపోయాడు. డ్రెస్సింగ్ రూమ్‌లో సమస్యలు సద్దుమణిగి.. అంతా పాండ్యా మాట వింటారు అనే సంకేతాలిచ్చినా ముంబై ఆట మారలేదు.

8 మ్యాచుల్లో 146 పరుగులే చేసిన ఈ ఆల్‌రౌండర్.. బంతితో మరీ ఘోరంగా 4 వికెట్లే తీశాడు. 19వ సీజన్‌లో ముంబైని గెలిపించడంలో విఫలమైన పాండ్యాను ఉద్దేశపూర్వకంగానే పక్కన పెట్టారనే వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు అతడిని అమ్మేసేందుకు ముంబై సిద్ధమైందనే కథనాలు వస్తున్నాయి. కానీ, ఈ వార్తలపై ఫ్రాంచైజీ మాత్రం ఇంకా ప్రకటించలేదు. చూస్తుంటే.. పొమ్మనలేక పొగబెట్టినట్టుగా పాండ్యా పరిస్థితి తయారైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రియురాలు మహీకా శర్మతో మైదానంలో నానా రచ్చ చేయడం కూడా పాండ్యాపై విమర్శలకు దారి తీసిన విషయం తెలిసిందే.

MOVIE TIME



# 'పెద్ది' పవర్ ప్లే టూర్ షురూ..

**8 రోజుల్లో 7 నగరాలు, భారీ వేడుకలకి పక్కా స్కెచ్!**

**టాకీస్:** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న 'పెద్ది' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రం కోసం అభిమానులు, సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్, రెండు పాటలు సినిమాపై అంచనాలను మరింత పెంచేశాయి. ముఖ్యంగా ఈ సినిమాలో రామ్ చరణ్ కుస్తీతో పాటు క్రికెట్ ఆడే పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే విడుదలైన విజువల్స్ స్పష్టం చేశాయి. మాస్, ఎమోషన్, స్పోర్ట్స్ అంశాల కలయికగా రూపొందుతున్న ఈ చిత్రంపై రోజురోజుకీ హైప్ పెరుగుతోంది.

ఇప్పుడు సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్‌ను కూడా భారీ స్థాయిలో ప్లాన్ చేశారు. ఓ అభిమాని "పెద్ది ప్రమోషన్స్ ఎక్కడ?" అంటూ లేఖ రాయగా, దానికి స్పందించిన చిత్రబృందం 'పవర్ ప్లే టూర్' పేరుతో ప్రత్యేక ప్రమోషనల్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఇందులో ఏ తేదీన ఏ నగరంలో ఈవెంట్ జరుగుతుందో ప్రకటించారు. మే 18న ముంబైలో భారీ వేడుక నిర్వహించి 'పెద్ది' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాత మే 22న ఉప్పల్ స్టేడియంలో భారీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ వేడుకలో ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో ప్రత్యేక సంగీత కచేరీ నిర్వహించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది.

# శర్వానంద్ సరసన ఛాన్స్ కొట్టేసిన మానస వారణాసి!



టాకీస్: టాలీవుడ్ స్టార్ శర్వానంద్, వరుస హిట్‌లతో దూసుకుపోతూ తన మార్కెట్‌ను పెంచుకుంటున్నారు. తాజాగా ఆయన సీనియర్ దర్శకుడు శ్రీనువైట్లతో చేతులు కలపడం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. శ్రీనువైట్ల అంటేనే మనకు గుర్తొచ్చేది కడుపుబ్బ నవ్వించే వినోదం. అయితే ఈసారి ఆయన కేవలం కామెడీకే పరిమితం కాకుండా, దానికి 'టైమ్ ట్రావెల్' అనే సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌ను జోడిస్తున్నారు. శర్వానంద్ టైమింగ్‌కు, శ్రీనువైట్ల మార్క్ హ్యూమర్‌కు తోడు సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్ తోడైతే బాక్సాఫీస్ వద్ద సరికొత్త మేజిక్ జరుగుతుందని చిత్రబృందం భావిస్తోంది. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జులైలో సెట్స్ పైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో ఈ సినిమాను నిలపాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడినట్లు కనిపిస్తోంది. మొదట స్టార్ హీరోయిన్ల పేర్లు వినిపించినప్పటికీ, చివరకు మిస్ ఇండియా రన్నరప్ మానస వారణాసిని ఖరారు చేసినట్లు సమాచారం. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో నటిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న మానసకు, శర్వానంద్ పక్కన ఇది ఒక గోల్డెన్ ఛాన్స్ అని చెప్పాలి. ఈ కొత్త జోడీ వెండితెరపై ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఫీల్‌ను ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

# 'జన నాయగన్' కోసం రంగంలోకి సీఎం విజయ్..

**కేన్స్ వెళ్లిన నిర్మాతకు పిలుపు!**



**టాకీస్:** తమిళనాడు ముఖ్యమంత్రి, అగ్ర నటుడు విజయ్ తన చివరి చిత్రం 'జన నాయగన్' విడుదలకు మార్గం సుగమం చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. సెన్సార్ సమస్యల కారణంగా విడుదల ఆగిపోయి ప్రస్తుతం రివైజింగ్ కమిటీ వద్ద ఉన్న ఈ సినిమా అడ్డంకులను తొలగించే పనిపై ఆయన దృష్టి సారించారు. ఇందులో భాగంగా, ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్ర నిర్మాతను తక్షణమే చెన్నైకి తిరిగి రావాలని విజయ్ సూచించినట్టుగా కోలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. విజయ్ నటుడిగా చేస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే, సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా విడుదల వాయిదా పడుతూ వచ్చింది. ఇటీవల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్, ఒకవైపు పాలనలో సంచలన నిర్ణయాలు తీసుకుంటూనే తన సినిమా విడుదలకు ఉన్న అడ్డంకులను తొలగించాలని భావిస్తున్నారు.

ఈ క్రమంలోనే కేవీఎన్ బ్యానర్ నిర్మాత వెంకట్ ను కేన్స్ పర్యటన మధ్యలోనే ముగించుకుని చెన్నై బయల్దేరి రావాలని విజయ్ కోరినట్లు సమాచారం.

# మైసా కోసం రష్మిక ప్రత్యేక ట్రైనింగ్

టాకీస్: స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆమె నటిస్తున్న యాక్షన్ డ్రామా 'మైసా'పై ఇప్పటికే సినీ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన కేరళ షెడ్యూల్ పూర్తి చేసిన రష్మిక.. అక్కడి అనుభవాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకోవడంతో అవి వైరల్‌గా మారాయి. కొచ్చిలో జరిగిన షూటింగ్ గురించి రష్మిక చేసిన పోస్టులు ఇప్పుడు నెటింట చర్చనీయాంశంగా మారాయి. ప్రకృతి అందాలు, అడవులు, జలపాతాలు, ఎత్తైన కొండలు, వర్షాల మధ్య సాగిన షూటింగ్ తనకు జీవితాంతం గుర్తుండిపోయే అనుభవమని ఆమె వెల్లడించారు. ప్రత్యేకంగా ఎత్తైన ప్రదేశాలంటే తనకు భయం ఉన్నప్పటికీ.. 'మైసా' సినిమాలో యాక్షన్ సన్నివేశాల కోసం ఆ భయాన్ని ఎదుర్కొంటూ స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నానని రష్మిక తెలిపారు. షూటింగ్ సమయంలో అడవుల్లో ట్రెక్కింగ్, ఔట్‌డోర్ యాక్షన్ ఎపిసోడ్స్, భారీ వర్షాల మధ్య చిత్రీకరణ చాలా కష్టంగా సాగిందని చెప్పారు. ఈ షెడ్యూల్‌లో యాక్షన్ సీన్ల కోసం శారీరకంగా చాలానే శ్రమపడాల్సి వచ్చిందని రష్మిక వెల్లడించారు. మోకాళ్లు, కాళ్లకు టేపింగ్ వేసుకుని కూడా యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నానని తెలిపారు. తనతో పనిచేస్తున్న యూనిట్ సభ్యులు కూడా జాగ్రత్తగా ఉండాలని తరచూ చెప్పేదాన్ని గుర్తు చేసుకున్నారు. అయితే ఈ కష్టాల మధ్య కేరళలో ఫేమస్ అయిన 'పాళమ్ పూరీ'ని మాత్రం బాగా ఎంజాయ్ చేశానంటూ సరదాగా చెప్పడం అభిమానులను ఆకట్టుకుంటోంది. అలాగే బాల్కనీలో నిలబడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్న కొన్ని ఫొటోలను కూడా రష్మిక ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ ఫొటోల్లో ఆమె చాలా నేచురల్‌గా కనిపించడంతో అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇక 'మైసా' సినిమా విషయానికి వస్తే.. దర్శకుడు రవీంద్ర పుల్లే తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.



# 'కరుప్పు' చిక్కులకు చెక్ పడ్డట్టే..!

**టాకీస్:** కోలీవుడ్ స్టార్ సూర్య నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి కరుప్పు. పాపులర్ యాక్టర్ కమ్ డైరెక్టర్ ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తెలుగులో వీరభద్రుడు టైటిల్‌తో విడుదల కానుంది. ఈ చిత్రం మే 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ రిలీజ్ కావాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం గురువారం ఉదయం నుంచే థియేటర్లలో షోలు ప్రారంభం కావాల్సి ఉంది. కానీ రిలీజ్‌కు ముందు ఆర్థికపరమైన చిక్కులు తలెత్తడంతో మార్నింగ్ షోలు నిలిచిపోయినట్లు వార్తలు వచ్చాయని తెలిసిందే.

తమిళనాడులో ప్రత్యేక షోలకు అనుమతులు వచ్చినప్పటికీ, అవి కూడా రద్దు కావడం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. చివరి నిమిషంలో షోలు రద్దు కావడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉంటే మేకర్స్ , ఫైనాన్షియర్ల మధ్య నెలకొన్న సమస్యల కారణంగా డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు కొంత అయోమయంలో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. కాగా ఈ సమస్యను కొలిక్కి తీసుకువచ్చేందుకు సూర్య స్వయంగా రంగంలోకి దిగాడట. సంబంధిత ఫైనాన్షియర్లతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి



హామీనిచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం నుంచి సినిమా థియేటర్లలో స్క్రీనింగ్ అయ్యే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ సర్కిల్ టాక్.

ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. చాలా కాలం తర్వాత సూర్య, త్రిష కాంబోలో వస్తున్న సినిమా కావడంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది. ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్‌పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ ఆర్ ప్రకాశ్ బాబు, ఎస్ఆర్ బాబు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సాయి అభ్యాంకర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.